ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 17 జూన్ 2025





ఉష్ణోగ్రత (అంచనా) 17-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	28
నరసరావుపేట	36	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	27
చీరాల	36	28

కౌలు రైతు సుఖీభవ అనండి

సొంత పొలం ఉన్న వారి వివరాలు మాత్రమే

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రస్తుతం సొంత పొలం యజ మానుల వివరాలనే నమోదు చేయాలనే ఆదేశాలు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కౌలు రైతులకు పథకం వర్తింప చేయడంపై తమకు ఎలాంటి మార్గ దర్శకాలు రాలేదనేది యంత్రాంగం మాటగా ఉంది. పెట్టుబడి సాయంలో చేదోడువాదోడుగా ఉండే అన్నదాత సుఖీభవ పథకం తమకు అందించే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయానికి రాకపోవడం పట్ల కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిలో అయోమయం

- అర్హులుగా సొంత పొలం యజమానులు
- కౌలు దారుల సంగతి ఎటూ తేల్చని ప్రభుత్వం
- సీసీఆర్ కార్డుల జారీ ఇంకా ప్రారంభ దశలోనే
- మనుగడలో ఉన్న కార్డులు నిరుపయోగంగానే..
- పెట్టుబడి ఖర్చులకు ఏం చేయాలో పాలుపోని కౌలు రైతులు



అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రైతులకు అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితా విషయంలో వ్యవసాయ శాఖ తుది నిర్ణయానికి వచ్చింది. మరో మూ డు నాలుగు రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసేలా వడివడిగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. కానీ, కౌలు రైతులకు ఈ సాయం అందడంపై నీలి మేఘాలు కమ్ము కున్నాయి. ఇప్పటి వరకు వారికి పెట్టుబడి సాయం అందిం చడంపై ఎలాంటి మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయ లేదు. దీంతో అన్నదాత సుఖీభవ పథకం తమకు ఎండమావిగానే మిగలనుందా అనే ఆందోళనను కౌలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల (పంట సాగు హక్కు పత్రాలు) జారీ ప్రక్రియ ఈ పాటికే ఓ కొలిక్కి రావాల్సి ఉండగా.. ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం వారిని మరింత కలవరపరుస్తోంది. కౌలు రైతుకు ఏ ప్రయోజనం దక్కాలన్నా సీసీఆర్ కార్డే ప్రామాణికం చేయడంతో పాటు.. ఓ ప్రణాళిక లేని నిర్ణయాలతో గత ప్రభుత్వం వారి ప్రయోజనాలకు పెద్ద ఎత్తున గండి కొట్టిన సంగతి తెలిసిందే. సీసీఆర్‌సీ స్థానంలో కొత్త కౌలు చట్టం తెస్తామని ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రకటించింది. కానీ, ఇంతవరకు అది కార్యరూపం దాల్చకపోగా ఖరీఫ్ పనులు మొదలైనా సీసీఆర్ కార్డుల జారీ కనీసం 20 శాతం కూడా పూర్తి కాకపోవడం వ్యవసాయశాఖ వైఫల్యంగా కనబడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం తమ గోడు కూడా ఆలకించాలని, ఇప్పటికే వ్యాలిడిటీ ఉన్న కార్డుల విషయంలో పథకం అమలుపై ఆలోచించాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

◆ కౌలు రైతులే అధికం

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 4.50 లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటారనేది ఓ అంచనా. వీరిలో సొంత పొలం కనీసం అరెకరం

(మిగతా 8వ పేజీలో)



3వ వార్డులో బండి చెరువును ఆక్రమించుకుని కట్టుకున్న గృహాలు

చెరువుల ఆక్రమణలపై దృష్టి

- తొలగింపునకు రేపల్లె మునిసిపాలిటీ చర్యలు
- విలువైన భూముల్లో పక్కాగృహాల నిర్మాణం
- సర్వే చేసి గుర్తించిన అధికారులు
- అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్ల నిధులు

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించేందుకు దశాబ్దాల కిందట రేపల్లె పట్టణంలో చెరువులను ఏర్పాటు చేశారు. క్రమేపి పట్టణం విస్తరిస్తూ.. చెరువుల్లోకి వచ్చింది. దీంతో చెరువుల భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు చెరువు భూములను ఆక్రమించి, పక్కాగృహాలను కూడా నిర్మించుకున్నారు. దీనిని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రేక్షక పాత్ర వహించారు. దీంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తాగునీటి సమస్య తలెత్తకుండా చెరువుల అభివృద్ధి కోసం రూ.4.50 కోట్ల



బండిచెరువును ఆక్రమించుకుని కట్టుకున్న గృహాలను తొలగించాలంటూ మున్సిపల్ అధికారులు మార్క్ వేసిన దృశ్యం

నిధులను విడుదల చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని ప్రధాన బండిచెరువు, వేపాళమ్మచెరువు, నక్కవానిచెరువు, పేటేరురోడ్డులోని రజక చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించారు. వారం నుంచి చెరువుల సర్వే ప్రారంభించి ఆక్రమణలకు గురైన ప్రదేశాలను గుర్తించారు. బండి చెరువు, నక్కవాని చెరువు ఆక్రమణలకు గురయినట్లు గుర్తించారు. చెరువులో నిర్మించుకున్న పక్కా గృహాలకు మార్కింగ్ కూడా చేశారు. బండి చెరువులో సుమారు 43 మంది పక్కా గృహాలను నిర్మించుకున్నారని గుర్తించారు. నక్కవాని చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించి.. ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధి పనులు చేపట్టే పనిలో మున్సిపల్ అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో పట్టణంలోని ప్రధాన చెరువులన్నింటికి పూర్వవైభవం రానుంది.

త్వరలో ఆక్రమణల తొలగింపు..

పట్టణంలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ నిధులు మంజూరు చేయించారని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని ప్రధాన చెరువుల ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వేచేయించి ఆక్రమణలను గుర్తించామని, ఆక్రమణలదారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. అక్రమంగా కట్టుకున్న గృహాలను ఖాళీ చేయాలని సూచించినట్లు వెల్లడించారు.



15వ వార్డులో ఆక్రమణకు గురైన నక్కవాని చెరువు

అదనం.. 5,000 టన్నులే!

- నేటితో రబీ ధాన్యం సేకరణ ముగింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం నుంచి మూసివేస్తున్నట్లు కలెక్టర్ వెంకటమురళి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌కు మొత్తం 34,953 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. రబీకి తొలుత 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ లక్ష్యం చాలదని అంచనాకొచ్చిన సివిల్ సప్లయిస్ మరో 25 వేల టన్నుల సేకరణకు అనుమతులివ్వాలని గడచిన నెల మొదటి వారంలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి



పంపింది. ప్రభుత్వం తొలుత 5 వేల టన్నులకు ఎనేబుల్ ఇచ్చిందని దశలవారీగా మిగిలిన 20 వేల టన్నులకు కూడా అనుమతి వస్తుం దని అధికారులు చెబుతూ వచ్చారు. తొలుత ఇచ్చిన 30 వేల టన్నుల తో పాటు అదనం 5 వేల టన్నులు కూడా పూర్తయి ఇప్పటికే పది రోజులు గడిచింది. బాపట్ల, రేపల్లె పరిధిలో ఇంకా దాదాపు 40 వేల టన్నుల ధాన్యం ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిన యంత్రాంగం అదనపు అనుమతులు కోసం ఎదురుచూస్తూ వచ్చింది. కానీ, శాఖ కమిషనరేట్ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం, నిబంధనల మేరకు.. కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచే గడువు కూడా ముగియడంతో రబీ ధాన్యం సేకరణ ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు.

ఆర్భాటపు ప్రకటనలు దేనికి..

సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా అదనంగా 25 వేల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులంటూ ఆర్భాటపు ప్రకటనలివ్వడం, తర్వాత దానిని 5 వేల టన్నులతోనే సరిపెట్టడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. కమిషనరేట్ ఇచ్చిన మాట ప్రకారం అదనంగా అనుమతి ఇస్తుందనే దాదాపు పది రోజుల పాటు ఎలాంటి కొనుగోళ్లు జరపకపోయినా.. కేంద్రాలను తెరిచే ఉంచామని, కానీ ఆ అవకాశం లేకపోవడం వల్లే రబీ సేకరణ ముగిసినట్లు ప్రకటించాల్సి వచ్చిందని యంత్రాంగం చెప్పడం కొసమెరుపు.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!



- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ ఉంటే.. బదిలీ తప్పనిసరి
- స్వగ్రామం, సొంత మండలాల్లో నియామకానికి చెక్
- ఈ నెల 30 నాటికి ప్రక్రియ పూర్తి

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా.. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోయిన అయిదేళ్లలో బదిలీలు లేకపోవ డంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలకు అవకాశం కల్పించింది. గతేడాది నవంబరులో పరిమిత స్థాయిలో బదిలీలు జరగ్గా.. ఇప్పుడు జీవో నంబరు 5 ప్రకారం మొత్తం ఉద్యోగుల బదిలీకి అవకాశం కల్పించింది.

● ఐదేళ్లు దాటితే స్థాన చలనం తప్పదు

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కిందటేడాది ప్రభుత్వం అవకాశం కల్పించినా మెజారిటీ ఉద్యోగులు బదిలీలకు సిద్ధపడ లేదు. దీంతో నామమాత్రంగానే బదిలీలు జరిగాయి. దీంతో ఇప్పుడు ప్రభుత్వం సచివాలయాల్లో పాతుకుపోయిన వారిని బదిలీ చేసేందుకు పూనుకుంది. ఒకే సచివాలయంలో ఐదేళ్లపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులను వేరే సచివాలయానికి బదిలీ చేస్తూ జీవో జారీ చేసింది. ఐదేళ్ల పూర్తికాని ఉద్యోగుల వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే ఉద్యోగులు ఎవరూ వారి సొంత గ్రామాలు, మండలాలకు బదిలీ అయ్యే వీలు లేదు. దీని పైనే.. ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తక్కువ జీతాలతో పనిచేసే వారికి సొంత ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం కల్పిస్తే ఆర్థిక భారం తప్పు తుందని చెబుతున్నారు. బదిలీల జీవో వచ్చిన వెంటనే వారు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,322 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 562, పల్నాడు జిల్లాలో 532, బాపట్ల జిల్లాలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వరకూ 228 సచివాలయాలు ఉన్నాయి మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 824 గ్రామ సచివాలయాలు ఉండగా వాటిలో 7,069 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి కోసం ఒక మాడ్యూల్ రూపొందించారు. వీరి బదిలీలకు సంబంధించిన ఖాళీల ఎంపిక ఎంపీడీవోలకు అప్పగిం చారు. కాగా ఉమ్మడి జిల్లాలో 439 వార్డు సచివాలయాల్లో 3,912 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి కోసం వేరొక మాడ్యూల్ రూ పొందించారు. వీరి బదిలీలకు సం బంధించిన ప్రక్రియని మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. వారే తమ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలను నమోదు చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు.

● ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీలు

ఉద్యోగుల ఎంపిక సమయంలో జరిగిన విధంగానే ఉమ్మడి జిల్లాల ఆధారంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లే అపాయింటింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. బదిలీ ఆదేశాలు వారే ఇస్తారు. హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్లో రెండు మాడ్యూళ్లలో అభ్యర్థులు తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

● ప్రత్యేక కేటగిరీలకు ప్రాధాన్యం

కంటి చూపులేని, బుద్ధి మాంద్యం పిల్లలు న్న ఉద్యో గులకు వైద్య సదుపాయాలు అందు బాటులో ఉన్న చోటే పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి సర్వీసు ఉన్నవారికి, వైకల్యం 40 శాతానికి మించి ఉన్నవారికి, ఆరోగ్య కారణాల రీత్యా

(మిగతా 8వ పేజీలో)

ట్రాఫిక్ విధులకు 16 ద్విచక్ర వాహనాలు

ప్రారంభించిన ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ విధుల నిర్వహణకు జిల్లా పోలీసు కార్యాలయానికి 16 నూతన ద్విచక్ర వాహనాలు వచ్చాయి. వాహనాలను సోమవారం ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ అవగాహన కల్పించారు. పోలీసు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదగా పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ద్విచక్ర వాహనాలను డీజీపీ పి.హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బైక్‌లకు పోలీసు సైరన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, ప్రథమ చికిత్స కిట్‌లతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేయడం జరిగిందన్నారు. బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి, మార్టూరు, చెరుకుపల్లి, భట్టిప్రోలు ప్రాంతాల్లో ట్రాఫిక్ క్లియర్ చేయడానికి వీటిని వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీఆర్ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాలను ప్రారంభించి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బంగారు కుటుంబాలకు చేయూత

- పదమూడు మందికి రూ.10.95లక్షలు
- అధికారులూ సహకారమందించాలి : కలెక్టర్

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పీ-4 పథకం కింద బంగారు కుటుంబాలకు సోమవారం కలెక్టరేట్‌లో చేయూత నందించారు. బంగారు కుటుంబాల జీవనస్థితిగతులను పరిగణంలోకి తీసుకున్న డీఆర్‌డీఏ 13 కుటుంబాలను దత్తత తీసుకుంది. వారికి స్థిరమైన జీవనోధి కల్పించడం కోసం రూ. 10.95లక్షలను కలెక్టర్ మంజూరు చేశారు. చెక్కు రూపంలో నగదును బంగారు కుటుంబాలకు కలెక్టర్ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంగారు కుటుంబాలకు జిల్లా అధికారులు తమవంతు సహయసహకారాలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 పథకం బాపట్ల జిల్లాలో అమలులోకి వచ్చిందన్నారు. బంగారు కుటుంబాలకు చేయూనిచ్చేందుకు, జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు 300మంది మార్గదర్శిలుగా సంబంధిత వెబ్ పోర్టల్‌లో తమపేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. 50లక్షల రూపాయలకు మించి వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలను మార్గదర్శిలుగా గుర్తించిందన్నారు. అలాంటి మార్గదర్శిలు 6వేలమంది నమోదవ్వాలన్నారు. పీ4 విధానంపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు.



పీ4తో లబ్ధి పొందిన వారితో కలెక్టర్ జె.వెంకటమురళి

పీ-4 లబ్ధిదారులు

ఎస్ ప్రవీణకు గొర్రెల పెంపకం కోసం రూ. 2లక్షలు, టీ లక్ష్మీ గృహనిర్మాణం కొరకు రూ. 2లక్షలు, కే అరుణ కిరణా దుకాణం కొరకు రూ. 1లక్ష, షేక్.కరిష్మా గృహనిర్మాణం కొరకు రూ. 1 లక్ష, కే పోలేరమ్మ చేపల వ్యాపారం కొరకు రూ. 1లక్ష, సింగోతులక్ష్మీ వ్యవసాయం కొరకు రూ. 1లక్ష, తోట కనకమ్మ ఇంటి అప్పుకొరకు రూ. 1లక్ష, ఎం.మేరి కూరగాయల వ్యాపారం కొరకు రూ. 50 వేలు, కంచర్ల మహాలక్ష్మీ ఇంటినిర్మాణం కొరకు రూ. 50 వేల రూపాయలచెక్కులను కలెక్టర్ అందజేశారు. అలాగే 50వేల రూపాయలువిలువ చేసే వినికిడి యంత్రాలను పద్మ, వెంకటశేషమ్మ, కోటేశ్వరమ్మలకు అందజేశారు. పెదగంజాం గ్రామానికి చెందిన వెంకటరెడ్డికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూఅధికారి జీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పీ గ్లోరియా, వెలుగు అధికారులు కే రవికుమార్,జీ సుబ్బారావు, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణాధికారిగా.. విమల బాధ్యతల స్వీకారం

● నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎంగా రవికాంత్ రిలీవ్



డీపీటీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న విమల

గుంటూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా రవాణాధికారిగా సీహెచ్ విమల గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని కార్యాలయంలో సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ (వర్క్స్)గా వ్యవహరిస్తోన్న ఆమె గుంటూరు డీపీటీవోగా నియమితులైన విషయం తెలిసిందే. నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం (ఓఅండ్‌సీ)గా బదిలీ అయిన రవికాంత్ ఇక్కడ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. నూతన డీపీటీవో విమల మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిప్యూటీ సీఎంఈ కె.సత్యనారాయణ, పీవో పి మాలతి, డిపో మేనేజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది నూతన డీపీటీవోకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

పెట్రోల్ పోసుకుని కుటుంబం ఆత్మహత్యాయత్నం

❖ జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట కలకలం



జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొపనాతి శ్రీనివాసరావు, ఝాన్సీ దంపతులు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అవసరానికి అప్పు ఇచ్చిన వ్యక్తి సాక్షి సంతకం పేరుతో తమ ఎకరం రొయ్యల చెరువు రాయించుకున్నాడని, ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నాడని.. తమకు న్యాయం చేయాలంటూ భార్యభర్తలు ఇద్దరు పిల్లలతో సహా పెట్రోల్ పోసుకుని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకుని, వివరాలు సేకరించారు. బాధితుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం హారీస్‌పేటకు చెందిన కొపనాతి శ్రీనివాసరావుకు రెండెకరాల రొయ్యల చెరువు ఉంది. సమీప గ్రామం పాత హారీస్ పేటకు చెందిన మోపిదేవి పోతురాజు దగ్గర రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. పోతురాజు వడ్డీ వసూలు చేసింది చాలక.. పొలం కొన్నానని రిజిస్ట్రేషన్ కోసం సాక్షి సంతకం కావాలని చెప్పి శ్రీనివాసరావును తీసుకెళ్లి అతని.. ఎకరం రొయ్యల చెరువును రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులు తర్వాత మరొకరికి విక్రయించాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. అప్పు ఇచ్చిన నగదుకు చెరువు తీసుకున్నానని, గొడవపడి చంపుతానని బెదిరించినట్లు శ్రీనివాసరావు భార్య ఝాన్సీ వివరించింది. మిగిలిన ఎకరం చెరువు దగ్గరకు కూడా వెళ్లకుండా దుర్భాషలాడుతూ దాడికి యత్నిస్తున్నాడని వాపోయింది. పోతురాజుకు కన్నా శ్రీనివాసరావు అనే వ్యక్తి మద్దతుగా తమను బెదిరిస్తున్నాడని ఆమె వివరించింది. అడువుల దీవి పోలీసుస్టేషన్‌లో తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని ఇక చేసేది లేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆత్మహత్యయత్నం చేసిన కుటుంబాన్ని పోలీసులు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ తుషార్ డూడీ తీవ్రంగా స్పందించారు. వారికి ఎస్కార్ట్ ఇచ్చి రేపల్లె రూరల్ సీఐ పి.సురేష్ దగ్గరకు పంపించారు. నిజాంపట్నం తహసీల్దార్‌తో కలిసి వెళ్లి గ్రామంలో క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి వెంటనే రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు.

పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ భూ విరాళం

మంత్రి మనోహర్ సమక్షంలో రూ.కోటి విలువైన భూమి పత్రాలు అందజేత

కొలకలూరులో 'సెర్ప్' పరిశ్రమకు సహకారం

స్ఫూర్తితో అభివృద్ధికి రూ.10 లక్షలు ప్రకటించిన మంత్రి

తెనాలి రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోల్ మోడల్ పంచాయతీగా కొలకలూరును తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గానూ పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ నిర్వాహక కుటుంబ సభ్యులు పొన్నకంటి సువర్చల శశికిరణ్ మంత్రి మనోహర్‌ను కలిసి ప్రభుత్వానికి రూ.కోటి విలువజేసే ఎకరం పొలాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్.. గ్రామాభివృద్ధికి మంచి మనస్సుతో ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. ఈ స్థలంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, స్థానికంగా ఉండే మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసేలా తీర్చిదిద్దుతామన్నారు. అందుకు స్వయంగా మంత్రి మనోహర్ తన కుటుంబం తరుపున రూ.10 లక్షలు విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కాంప్లెక్స్ మూడు అంతస్తులుగా నిర్మించనున్నారు. అందులో మహిళలకు, నిరుద్యోగులకు, స్వయం ఉపాధి పొందేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టి స్వయంగా.. వారి కాళ్లపై వారు నిలిచేలా ప్రోత్సహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టను త్వరితగతిన ప్రారంభించి రాబోయే మూడు నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. మనోహర్ మాట్లాడుతూ తండ్రి పోతురాజు స్ఫూర్తితో కుమార్తె సువర్చలా శశికిరణ్ తన గ్రామానికి మంచి చేయాలని మంచి ప్రభుత్వానికి స్థలాన్ని అందించాలని ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను పుట్టిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని, ఇక్కడ ప్రజలకు మంచి జరగాలని అనునిత్యం తపించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు మంత్రి మనోహర్ అని స్థల దాత పొన్నెకంటి సువర్చల శశికిరణ్ అన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం తపించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడని విశ్వసించి ఆయన ద్వారా భూమిని అందించేందుకు ముందుకు వచ్చామన్నారు. రాష్ట్రంలోనే కొలకలూరు గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని తాము నమ్ముతున్నట్లు తెలిపారు.

హామీ మేరకు తల్లికి వందనం అమలు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీ మేరకు తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉన్నా అంతమందికీ అమలు చేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మొన్నటిదాక ప్రతిపక్షం సూపర్ సిక్స్ ఏమైందని క్యాంపెయిన్ చేసిందని, ఇప్పుడు తల్లికి వందనం నగదు జమచేయడం ప్రారంభం కాగానే ఇందులో రూ.2 వేలు ఏమైంది, మంత్రి లోకేశ్ ఖాతాలోకి వెళ్లాయి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో కూడా రూ.2 వేలు తీసుకున్నారని, ఇప్పుడు కూడా ఆ నగదు పాఠశాల నిర్వహణకు ఖర్చుపెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ ముందుకు వచ్చి తనపై వచ్చిన ఆరోపణలు నిరూపించాలని చాలెంజ్ విసిరినా.. కనీసం దాని గురించి మాట్లాడింది లేదన్నారు. ఒక మంచి పని చేస్తుంటే దానుంచి దృష్టి మరల్చ డానికి ఇలాంటి అబాండాలు వేయడాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తుంచు కోవాలన్నారు. 15 రోజుల్లో అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కూడా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును చిత్తశుద్ధితో కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, నిన్న వచ్చిన కేంద్ర మంత్రి కూడా దీనిపై సమీక్ష చేశారని చెప్పారు. పొగాకు కొనుగోలుపై ఆలోచిస్తున్నారని చెప్పారు. ప్రతి పక్షం దృష్టి మరల్చే రాజకీయం మానుకోవాలని, అదే పంథాలో పోతామంటే అధికార పక్షంలోని వారు చేతులు కట్టుకొని ఉండరని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ, కూటమి నాయకులు ఉన్నారు.

సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా శ్రీనివాసమూర్తి



గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా ఎల్.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ్ 113వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్ఎఫ్ ఐఆర్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసమూర్తి గుంటూరు డివిజన్‌లో సీటీఐ స్క్వాడ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన సంఘ్ డివిజనల్ సెక్రటరీ వీవీ రమణయ్య, అధ్యక్షుడు వై.సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

'కో-ఆపరేటివ్' బ్యాంకు ఎంప్లాయీస్

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో - ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కేవీ శివరావు, టి.శివకృష్ణ, కోశాధికారిగా పి.లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోనూరు గోపి ప్యానల్ విజయం సాధించింది. గుంటూరులో ఆదివారం అసోసియేషన్ జిల్లా మహా జన సభ అనంతరం ఎన్నికలు అర్ధరాత్రి వరకు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల ఉద్యోగులు ఎన్నికలకు హాజరయ్యారు. ఎన్నికల అధికారి జి.నారాయణరెడ్డి అర్ధరాత్రి దాటిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి, ఫలితాలను ప్రకటించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.మురళీ, అసిస్టెంట్ సెక్రటరీగా షేక్ జాన్‌బీ, డైరక్టర్స్‌గా జి.శ్రీనివాసరావు, కె.అనిత భావన, కె. భాగవతి, ఎం.ప్రవళిక, ఆర్.భాను, వి.నరేంద్రరెడ్డి ఎన్నికైనట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గ సభ్యులకు బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నకరికల్లులో 17వ శతాబ్దం నాటి విగ్రహం



నకరికల్లు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు నుంచి శివాపురం వెళ్లే రహదారి సమీపంలో సోమవారం 17వ శతాబ్దం నాటి విగ్రహం బయట పడింది. వీరుడు, తోడుగా భార్య ఉన్నట్టు ఈ విగ్రహం ఉంది. కుడి చేతిలో ఈటె, బల్లెం, ఎడమ చేతిలో కత్తి కలిగి ఉండటాన్ని బట్టి వీరుడు శత్రువును గాని, క్రూర జంతువును గాని వేటాడుతున్నట్లు చెక్కబడి ఉంది. తల భాగం లేక పోవడంతో ఆ స్థానంలో సిమెంట్‌తో చేసిన ఆనవాళ్లు కనపడుతున్నాయని, పల్నాటి సున్నపురాయితో ఈ విగ్రహం చెక్కినట్లు పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి తెలిపారు. ఈ విగ్రహాన్ని పరిశీలించిన ఆయన క్రీస్తు శకం 15వ శతాబ్దం నాటిదిగా తెలిపారు. వీరవంతుడు, అతని భార్య యుద్ధానికి సిద్ధం అన్నట్లుగా ఈ విగ్రహం చెక్కబడి ఉందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్యుడు వెంకటేష్

తెనాలి రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని వీఎస్ఆర్ కళాశాల వద్ద మంగళగిరి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తెనాలి పట్టణానికి చెందిన బి.వెంకటేష్ (35), స్నేహితురాలు యామినితో కలిసి సోమవారం సాయంత్రం విజయవాడకు బయలు దేరారు. మార్గ మధ్యలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించగా వెంకటేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యామిని చికిత్స పొందుతోంది. మృతుడు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల డయాలసిస్ విభాగంలో ప్రైవేట్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. డాక్టర్ మృతి చెందడంతో పలువురు వైద్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

కొల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగలు దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో తెనాలి రెండవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ బి.రాజశేఖర్ ముద్దాయి మర్రి వెంకయ్యకు ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఈ మేరకు సోమవారం ఉత్తుర్వులు జారీ చేశారు. కొల్లూరు గ్రామానికి చెందిన నంబూరి మధుసూదన్‌రావు నూతన గృహ ప్రవేశం 2021 ఆగస్టులో జరగగా.. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన సోదరి పొన్నూరుకు చెందిన సంకాల లక్ష్మీసుకన్య బంగారు ఆభరణాలున్న బ్యాగు రాత్రి చోరీకి గురైంది. దీంతో అప్పటి ఎస్ఐ ఉజ్వల్‌కుమార్ కేసు నమోదు చేశారు. అదే నెలాఖరును హనుమాన్‌పాలెం కరకట్ట దగ్గర ఎస్ఐ యూ శ్రీనివాసరావు నిందితుడు మర్రి వెంకయ్యను అరెస్టు చేసి.. అతని నుంచి రూ.7.40 లక్షల నగదుతోపాటు సుకన్యకు చెందిన నగలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి తెనాలి రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ కేసు వాదించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వరరావు సహకారం అందించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

❖ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు తదితరులు

పెదకాకాని, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యోగా అవగాహన ర్యాలీ సోమవారం జరిగింది. వర్సిటీ మెయిన్ గేట్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తి పాల్గొని, మాట్లాడారు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు. రోజువారీ యోగా అభ్యాసం సంపూర్ణ శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ యోగా భావోద్వేగ స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఇన్‌చార్జి రెక్టార్, రిజిస్ట్రార్ ఆచార్య రత్న షీలామణి, ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న వర్సిటీ ప్రధాన క్రీడా మైదానంలో సుమారు 10 వేల మందితో యోగాంధ్ర వేడుకలు జరుగుతాయని తెలిపారు. వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ కోయంబత్తూర్ వర్సిటీ కో-ఆర్డినేటర్ ఎ. రాధిక వివిధ యోగాసనాలు చేయించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, రూసా డైరెక్టర్ ఆచార్య ఎస్ మురళీమోహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డు గ్రేడ్-1 సెక్రటరీగా సుబ్రహ్మణ్యం కొనసాగింపు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) గ్రేడ్-1 సెక్రటరీగా సీహెచ్ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌ని కొనసాగిస్తూ మార్కెటింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు ఏఎంసీ గ్రేడ్-1 సెక్రటరీ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌పై మిర్చి యార్డులో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డిప్యూటేషన్ ముగియగా.. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఇక్కడే కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా సునీత



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఐఓ సునీత

గుంటూరు (విద్య) జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు ఆర్ఐఓగా గర్నెపూడి సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆమెను బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అక్కడ విధులు నిర్వహిస్తూనే గుంటూరు ఆర్ఐఓగా (ఎఫ్ ఏసీ) సునీత బాధ్యతలు నిర్వహిస్తారు. నూతన ఆర్ఐఓను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రేపు ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు విద్య జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకులు సాయి వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. వివరాలకు 99516 77559 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

కేసానుపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఈవోపీఆర్డీకి షోకాజ్ నోటీసు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం కేసానుపల్లి పంచాయతీ కార్యదర్శి కె.భార్గవ్ శ్యామ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరసరావుపేట ఈవోపీఆర్డీ నాగానందంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిచడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారని డీపీవో నాగేశ్వరనాయక్ తెలిపారు. ఈ నెల 11న పెదతురకపాలెంలో నిర్మించిన గిరిజన గురుకుల పాఠశాల భవనాన్ని మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరయ్యారు. పెదతురకపాలెం మార్గంలో కేసాను పల్లిలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు గమనించారు. ఈ నేపథ్యంలో డీపీవోను విచారణకు ఆదేశించారు. పారిశుధ్యం పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు డీపీవో నివేదిక మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు కార్యదర్శి, ఈఓపీఆర్‌డీపై చర్యలు తీసుకున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట శృతి(9) అనే బాలిక తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక వైఎస్ఆర్ కాలనీకి చెందిన గాలేటి రాంబాబు అనే వ్యక్తి భార్య కావేరి, మేనకోడళ్లు వెంకటశృతి, బాలసాహితితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం కనపర్రు చర్చికి ప్రార్థనలకు వెళ్తున్నాడు. బైకును ఆర్టీసీ బస్ ఢీకొట్టింది. బైక్ ట్యాంకుపై కూర్చుని ఉన్న వెంకటశృతి బస్సు చక్రాల కింద పడింది. ప్రమాదంలో రాంబాబు, భార్య కావేరి స్వల్పంగా గాయపడ్డారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.60 అడుగులు ఉంది. ఇది 137.86 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

51,956 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 54,117 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,956 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,027 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9800	13400
273	10000	12400	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	13800
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

● ఎస్పీ తుషార్ డూడి ● పీజీఆర్‌ఎస్‌కు 52 అర్జీలు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్‌కు అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 52 మంది అర్జీల ద్వారా వారి సమస్యలను ఎస్పీకి వివరించారు. అర్జీలను పరిశీలించి ఆయా పోలీసుస్టేషన్‌లకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. కుటుంబ తగాదాలు, భూవివాదాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఇతర సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. చట్టపరంగా విచారించి పరిష్కారం చూపుతామని అర్జీదారులకు ఎస్పీ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వాగ్దానాలన్నీ అమలు చేస్తూ ప్రజారంజక పాలన

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌బాబు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వాగ్దానాలన్నీ నెరవేరుస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు అన్నారు. బాపట్ల పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సలగల మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా తల్లుల ఖాతాలలో డబ్బులు జమ చేయటంపై చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ పాలనలో గాడితప్పిన ప్రతి కార్యక్రమాన్ని చక్కదిద్ది మంచి పరిపాలన కొనసాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజాహితం కోరుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం చారిత్రాత్మకమన్నారు. తల్లికివందనం డబ్బులు విడతల వారిగా కాకుండా ఒకేసారి వేయటం పట్ల తల్లులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలు రాబోయే రోజుల్లో ఇదే విధమైన మద్దతు చంద్రబాబుకు ఇవ్వాలని ఆయన కోరారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రకిట్‌లను పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్న మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి తదితరులు

ఎన్నికల హామీ నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి

పిట్టలవానిపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగుపాలెం ఎంపీపీ పాఠశాలలో సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారితో కలిసి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి విద్యార్థులకు అందజేశారు. డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో హామీలిచ్చిన మాటను నిలబెట్టుకొని ప్రతి విద్యార్థికి ఈ విద్యా సంవత్సరంలో తల్లికి వందనం పథకం అమలు చేయటం ఎంతో సంతోషదాయకమన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేయటం శుభపరిణామమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకుమారి, విద్యార్థులు తల్లిదండ్రులు, టీడీపీ గ్రామకమిటీ కార్యదర్శి చందోలు రవికుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ : సరోజనీ

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో 5 సంవత్సరాలలో చేయలేని పనులన్ని కూటమి ప్రభుత్వం ఒకే సంవత్సరంలో చేసిందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అసత్య ఆరోపణలతో అల్లర్లు చేసి రాష్ట్రంలో వైసీపీ ఆలజడి సృష్టించాలని చూస్తుందన్నారు. తల్లికి వందనం హామీ అమలుతో తమ మనుగడ కష్టమని భావించి వైసీపీ అనేక ఆరోపణలు చేస్తుందన్నారు.

అతిసార వ్యాధి నుంచి పిల్లలను కాపాడుకుందాం : కలెక్టర్

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అతిసార వ్యాధి నుంచి పిల్లలను కాపాడుకుందామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యాచరణ అమలు గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన, ఇంటింటా సర్వే ద్వారా నమోదు చేసిన 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లు, జింకు ట్యాబ్లెట్‌లు తప్పకుండా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా ఇమ్యూనైజేషనాధికారి డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ మోజెస్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లలిత రాజేశ్వరి, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి,వైద్య,ఆరోగ్యశాఖాధికారులు

అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన

నిజాంపట్నం (రేపల్లె), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్‌గా విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటినే ప్రజలు తాగాలని ఎంపీహెచ్‌ఈవో సాంబశివరావు అన్నారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం పంచాయతీలో విషజ్వరాలపై సోమవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విషజ్వరాలు సంభవించినా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎం ఉషారాణి, ఆషా, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ అనుదీప్ పాల్గొన్నారు.

భర్తీపూడి రైల్వేగేటు తెరిచేవిధంగా చర్యలు తీసుకోవాలి

బాపట్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రైల్వేగేటును తాత్కాలికంగా తెరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భర్తీపూడి సర్పంచ్ అచంట అమరేష్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ రైల్వేగేటును రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం 15 నెలల నుంచి మూసివేసినందున ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి తాత్కాలికంగా రైల్వేగేటు తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫొటోగ్రాఫర్ నాగరాజుకు అంతర్జాతీయ అవార్డు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. కలకత్తాకు చెందిన కెఎటివి ఫొటోగ్రఫి వరల్డ్ వారు మేనెలలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పవన్ డిజిటల్ స్టూడియో అధినేత నాగరాజు శ్రీభావన్నారాయణస్వామి రథోత్సవం సందర్భంగా తీసిన ఛాయా చిత్రానికి మొదటి బహుమతి లభించింది. సంస్థ వ్యవస్థాపకురాలు సుజాతమండల్ సోషల్‌మీడియా ద్వారా నాగరాజుకు అభినందనలు తెలిపారు.

చెరువులు, సాగునీటి కాల్వల ఆక్రమణలను తొలిగించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

● పీజీఆర్‌ఎస్ అర్జీలను పరిశీలించి పరిష్కరించాలి



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కుంటలు, సాగునీటి కాల్వల ఆక్రమణలను మూడు నెలలలో తొలిగించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు చెప్పారు. అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 24,327 నీటి సంఘాల కమిటీలు ఉన్నాయన్నారు. 48,020 ఎకరాలు నీటి సంఘాల పరిధిలో ఉన్నాయన్నారు. 305 చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. 2,449 మంది ఆక్రమణ దారులు 299 ఎకరాలు ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణలు తొలిగించే ప్రక్రియకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకున్నవారంతా ఈనెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని కలెక్టర్ చెప్పారు. అంతర్జాతీయ కార్యక్రమానికి అనుబంధంగా సూర్యలంకలో 10వేల మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 6.74లక్షల మంది యోగాంధ్రలో పాల్గొనటానికి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. పీఈటీ ద్వారా ఉపాధ్యాయులు వెయ్యి మంది, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వెయ్యి మంది, కేర్ నాచరోపతి మెడికల్ కళాశాల విద్యార్థులు 500 మంది యోగాంధ్రలో నమోదు చేసుకున్నవారంతా హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 19న చీరాల నగరంలో యోగాంధ్ర అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీవో



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై పది అర్జీలు అందాయి. రేపల్లెకి చెందిన యార్లగడ్డ అప్పమ్మ ద్వితీయ కుమారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని రక్షణ కల్పించాలని కోరారు. పట్టణంలోని నక్కా నాగలక్ష్మి తన ఇంటి నివేశనస్థలం మంజూరుచేయాలని కోరారు. పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీమోహన్‌రావు విద్యుత్ డివిజనల్ ఆఫీస్, విద్యుత్ రెవెన్యూ ఆఫీస్‌లను ఏర్పాటు చేయలని కోరారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన యానం నాగకుమారి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. భట్టిప్రోలు మండలం అళ్ళమూడి గ్రామం ప్రజలు పరిశపాడు రెవెన్యూగ్రామంలోని డొంక మార్గం ద్వారా పొలాల్లోకి వెళ్ళే మార్గం ఉందని, అక్కడ రైతులు కొందరు అడ్డుకుంటున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. చుండూరు మండలం మండూరు గ్రామానికి చెందిన బెల్లం వెంకట సుబ్బారావు ఇంటి నివేశన స్థలాన్ని సర్వేచేసి హద్దులు చూపించాలని కోరారు. అళ్ళపాడు గ్రామానికి చెందిన బి.సాంబశివరావు తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈసమస్యలన్నింటిని పరిశీలించి ఆయా అధికారులకు తెలిపి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత : కలెక్టర్

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు జరుపుతున్న అన్ని కేంద్రాలు 17వ తేదీ నుంచి మూసివేయటం జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. 2024-2025 రబీ పంట కాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 34,953 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించటం జరిగిందన్నారు.

దాతల సహకారం అభినందనీయం

● ప్రధానోపాధ్యాయుడు పురం వెంకట సాంబశివరావు

బాపట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు పురం వెంకట సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో సోమవారం మోటుమర్రి సురేష్ అందించిన నోట్‌పుస్తకాలతోపాటు ప్రభుత్వం అందజేసిన విద్యార్థిమిత్ర కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈవిధంగా దాతలు సహకరించటం సంతోషదాయకమన్నారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు దాతల సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాళం నరేష్, విద్యాకమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్, ఉపాధ్యాయులు బి.రామకృష్ణ, బి.కోటేశ్వరరావు, విజయ్, మల్లేష్, పివి.రమణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గద్దె ప్రసాద్, పివి.ప్రసాద్, పి.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు పురం వెంకటసాంబశివరావు, దాత మోటుపల్లి సురేష్ తదితరులు

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



పూజిత్‌చౌదరి

కొల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు గ్రామానికి చెందిన పరుచూరి పూజిత్‌చౌదరి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోగా తల్లిదండ్రులు కుటుంబసభ్యులు అతని కోసం చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ బంధువుల వద్ద వాకబు చేశారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో బాలుడి తాత కన్నెగంటి జగన్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు ఘనసత్కారం

కర్లపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెదమార్పువారిపాలెం ప్రధానోపాధ్యాయుడు బొంతా వెంకటేశ్వర్లు చినపులుగువారిపాలెం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జస్వంత లక్ష్మి, రమణారావు, విద్యా కమిటీ చైర్మన్ మార్పు వినయ్‌కుమార్, మార్పు బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లును సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు

అగ్నిప్రమాదంలో రెండు ఇళ్ళు.. 12 ఎకరాల వామి దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

నగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీటావారిపాలెం గ్రామంలో సోమవారం తీవ్ర అగ్నిప్రమాదం సంభవించి నాలుగు కుటుంబాలకు సంబంధించిన రెండు ఇళ్ళు సుమారు 12 ఎకరాల గడ్డి వామి పూర్తిగా దగ్ధమైంది. దీంతోపాటు ద్విచక్ర వాహనాలు సైతం కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో ధూళిపూడి వెంకటేశ్వరరావు, గోపి, అంజిబాబు, ధూళిపూడి వెంకటనాగతేజ తీవ్రంగా నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తహసీల్దార్ నాంచారయ్య ప్రభుత్వం తరుపున తాత్కాలిక సాయంగా ప్రతి కుటుంబానికి రూ.5 వేలు, 20 కేజీల బియ్యాన్ని అందజేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

రేపల్లె మండల వ్యవసాయాధికారి మహేష్



మహేష్‌బాబు

రేపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రేపల్లె మండల వ్యవసాయాధికారిగా అవ్వారు మహేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పని చేసే ఆర్.విజయబాబు బదిలీపై దుగ్గిరాలకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధశాఖల ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది, ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్, సీసీఆర్‌సీ కార్డులు, ఈకేవైసీ, అన్నదాత సుఖీభవ వంటివాటిపై రివ్యూ చేసి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

చెరుకుపల్లి మండల ఏవోగా ఎండీ ఫరూఖ్



ఎండీ ఫరూఖ్

చెరుకుపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండల నూతన వ్యవసాయ అధికారిగా ఎండీ ఫరూఖ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా ముండ్లమూరు నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మండలంలోని ఏఈవోలు, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండివారి సమస్యలు తీర్చేవిధంగా కృషి చేస్తామన్నారు. అలాగే వ్యవసాయ విస్తరణాధికారిగా బీడీ రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

అమృతలూరు మండల ఏవోగా హేమంత్‌భరత్‌కుమార్



హేమంత్ భరత్‌కుమార్

అమృతలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా హేమంత్ భరత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఏవో లోకేశ్వరి బాపట్ల బదిలీపై వెళ్లారు. దీంతో నెల్లూరు జిల్లా కందుకూరు సబ్ డివిజన్ వలేటివారిపాలెం నుంచి అమృతలూరుకు బదిలీపై వచ్చారు.

భట్టిప్రోలు మండల ఏవోగా బ్రహ్మారెడ్డి

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు మండల వ్యవసాయ శాఖ అధికారిగా బి.బ్రహ్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా మాచర్ల సబ్ డివిజన్ రెంటచింతల మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా భట్టిప్రోలు విచ్చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జి ఏవో లక్ష్మీ ప్రసన్నను మరో చోటకు బదిలీ చేశారు.

కొల్లూరు మండల ఏవోగా నరేంద్రబాబు

కొల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా వి.నరేంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కొల్లూరు మండల గ్రామాల్లోని రైతులు అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈకేవైసీకి జూన్ 20వ తేదీ ఆఖరు తేదీ అన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాజారమేష్‌మోహన్

అమృతలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా రాజారమేష్ మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న శివయ్య సాధారణ బదిలీల్లో భాగంగా మంగళగిరికి బదిలీపై వెళ్లారు. ప్రత్తిపాడు మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న రాజారమేష్‌మోహన్‌ను అమృతలూరు డీటీగా నియమించారు. ఈసందర్భంగా వీఆర్వోలు ఆయన స్వాగతం పలికారు.

అమృతలూరు పశువైద్యశాఖ అధికారిగా నరేంద్రరెడ్డి



నరేంద్రరెడ్డి

అమృతలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు పశు వైద్యశాలకు డాక్టర్‌గా నరేంద్రరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న డాక్టర్ మౌనిక పెదరావూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు తాడేపల్లి పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డిని అమృతలూరు పశు వైద్య శాఖ అధికారిగా నియమించారు. అనంతరం మాట్లాడుతూ పశుపోషకులకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

యోగాతో మానసిక ప్రశాంతత

అమృతలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగా సాధకురాలు గుత్తికొండ శాంతకుమారి సోమవారం తెలిపారు. స్థానిక శ్రీఅమృతేశ్వర స్వామి ఆలయంలో మహిళలకు నెల రోజుల నుంచి యోగాపై అవగాహన కల్పించడంతోపాటు వారికి శిక్షణ ఇస్తున్నారు.



అమృతలూరులో యోగా చేస్తున్న మహిళలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌తో మంత్రులు అనగాని, భరత్

తిరుమలేశుని దర్శించుకున్న పీయూష్‌గోయల్, అనగాని

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామిని తిరుమలలో సోమవారం కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర మంత్రి పీజీ భరత్, టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి దర్శించుకున్నారు. అనగాని మాట్లాడుతూ రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందే విధంగా అండగా నిలవాలని కోరుకున్నానని తెలిపారు.

రేపల్లె-నిజాంపట్నం రహదారి పనులు వేగవంతం చేయాలి

● అనగాని శివప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపట్నం(రేపల్లె), జూన్ 16(ఆంధ్రజ్యోతి) : రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నత్తనడకన సాగుతున్న రహదారి అభివృద్ధి పనులపై 'ఆంధ్రజ్యోతి'లో 'గుత్తేదారు కనబడటం లేదా', అధ్వానంగా రేపల్లె-నిజాంపట్నం రహదారి అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం ఆయన సోదరుడు శివప్రసాద్, ఆర్ అండ్ బీ అధికారులు నిలిచిన అభివృద్ధి పనులను నిజాంపట్నం మండలం పల్లపట్ల దగ్గర నుంచి సజ్జావారిపాలెం వరకు పరిశీలించారు. రహదారి అభివృద్ధి త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. ఆర్ అండ్ బీ అధికారులు ఈ రహదారి పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు విడుదల చేస్తే గుత్తేదారులు పనులు ఎందుకు నిలుపుదల చేశారంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై మంత్రి అనగాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తక్షణమే రహదారి పనులు మొదలుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకటయాదవ్, గోగినేని శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, ఆర్ అండ్ బీ ఏఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.



పల్లపట్ల వద్ద ఆగిన రహదారి పనులను పరిశీలిస్తున్న మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్

రూ.55.70 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్

నగరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించేందుకే మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓవర్‌హెడ్‌ట్యాంక్‌కు నిధులు మంజూరుచేయించారని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దపల్లిలో పోలేరమ్మ గుడి సమీపంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పెదపల్లి గ్రామ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.55.70 లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. అనంతరం పెదపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.20 లక్షల నిధులతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, బాపట్ల పార్లమెంటరీ ఆర్గనైజేషన్ సెక్రటరీ తాతా ఏడుకొండలు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మత్తి భాస్కరరావు, పీవీ చింతారావు, మండల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ వెంకటమురళికి చేనేతల సన్మానం



కలెక్టర్ జె.వెంకటమురళిని సన్మానిస్తున్న చేనేత సహకార సంఘాల నాయకులు

బాపట్ల, చెరుకుపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : చీరాల కుప్పడం జరీ చీరలకు జాతీయ స్థాయి గుర్తింపు తేవడంలో కలెక్టర్ వెంకటమురళి కృషి ఎంతో ఉందని జిల్లా చేనేత నాయకులు కొనియాడారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా చేనేతసంఘం తరుపున ఆరుంబాక చేనేత సంఘం అధ్యక్షుడు దివిరాంబాబు, జీవీ నాగేశ్వరరావులు కలెక్టర్ వెంకటమురళికి సన్మానం చేశారు. చెరుకుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దివి రాంబాబు మాట్లాడుతూ ఇటీవల మార్కాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ స్కీం క్రింద చేనేతలకు యారన్ ఇచ్చి నైపుణ్యత కలిగిన చేనేత చీరలు తయారు చేయించారని, ఆ దుస్తులను ఢిల్లీ నుంచి వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ హ్యాండ్లూమ్స్ బృందం చీరాల ప్రాంతంలో తయారు చేసిన కుప్పడం జరీ చీరలకు జాతీయస్థాయి గుర్తింపు ఇచ్చారన్నారు. ఈ గుర్తింపుకై కలెక్టర్ ఎనలేని కృషి చేశారన్నారు. జూలై 14న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ ఈ అవార్డును అందుకుంటారన్నారు. ఈసన్మాన కార్యక్రమంలో ఇసుకపల్లి సొసైటీ నుంచి శోభన్‌బాబు, నాంచారయ్య, చీరాల సొసైటీ ప్రతినిధి సుబ్బారావు పాల్గొన్నారన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

నగరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ గ్రామాలలో సాగింది. యోగాసనాల ప్రాముఖ్యతను ప్రజలలో పెంపొందించేందుకు విద్యార్థులు ప్లేకార్డులు చేపట్టి గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ యోగా వల్ల ఒత్తిడిని అధిగమించటం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ హెచ్‌వోడీ శ్రీనివాసరావు, జువాలజీ హెచ్‌వోడి సురేష్‌బాబు, డిగ్రీ ఇంటర్మీడియట్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మందకొడిగా... మిర్చి ఎగుమతులు

● మార్కెట్‌లో తగ్గిన జోష్ ● రోజుకు సగటను 35 వేల టిక్కీల విక్రయం



మిర్చి ఎగుమతుల లోడింగ్ కోసం ఉంచిన కంటెయినర్లు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం మిర్చియార్డు ట్రేడింగ్ ప్రారంభమైనా కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉన్నంత వేగం ఇప్పుడు కనిపించడం లేదు. నాన్ ఏసీ మిరపకాయలు రాక పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడు మార్కెట్‌కి వస్తున్నదల్లా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిరపకాయలే. సీజన్‌లో చైనా, ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఇప్పుడు అరకొరగా తప్పితే ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ ఎక్కువగా రావడం లేదు. దీంతో ఇతర సరుకులతో గుంటూరు నగరానికి వచ్చిన కంటెయినర్లు వాటిని ఇక్కడ దిగుమతి చేసేశాయి. తిరిగి చెన్నై వెళ్లేందుకు మిర్చి లోడింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నాయి. చెన్నై పోర్టుకు కంటెయినర్లు లోడింగ్ ఉంటే చెప్పమని ఎగుమతిదారులకు పదేపదే ఆపరేటర్లు ఫోన్లు చేస్తున్నారు.

మిర్చి ఎక్స్‌పోర్టులలో చైనా ఆర్డర్లు 75 శాతం వరకు ఉంటాయి. మిగతా 25 శాతం ఇండోనేషియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, శ్రీలంక వంటి దేశాలకు వెళుతుంటాయి. చైనాకు ఏటా 2 లక్షల టన్నుల మిర్చి డిమాండ్ ఉండగా, ఈ ఏడాది 3 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. దీంతో అక్కడ నిండుగా సరుకు ఉండటంతో ఇప్పుడు అరకొరగానే దిగుమతిదారులు ఆర్డర్లు పెడుతున్నారు. ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కి డిమాండ్ మేరకు ఎగుమతులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచి మార్కెట్‌కు వచ్చే సరుకు అంతా స్థానిక అవసరాలకే వ్యాపారస్థులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

ధర పెరుగుదల కోసం ఎదురు చూపు

మిర్చి ధర పెరుగుదల కోసం అటు రైతులు, ఇటు స్టాకిస్టులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ కారణంతోనే శీతల గిడ్డంగుల నుంచి కొద్దికొద్దిగా మిర్చి టిక్కీలను బయటకు తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎక్స్‌పోర్టర్లకు అవసరమైన నాణ్యత మేరకు మిరపకాయలు రాకపోతుండటంతో నిత్యం ఉదయం కమీషన్ ఏజెంట్ దుకాణాల వద్దకు వచ్చి శాంపిల్స్ నాణ్యత చూసి వెనుదిరుగుతున్నారు.

పిడుగురాళ్లలోనే.. వ్యవసాయ పనిముట్లు

- ఇక గుడివాడకు వెళ్లాల్సిన పనిలేదు
- వ్యవసాయ యంత్రాలు ఇక్కడే తయారీ
- అందుబాటులో.. తక్కువ ధరకు
- రైతులకు లాభసాటి



పిడుగురాళ్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న దుక్కి దున్నే గొర్రు సెట్లు



తయారీ పూర్తవుతున్న ట్రాక్టర్ ట్రాలీలు

పిడుగురాళ్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెట్టింది పేరుగా ఉన్న పల్నాడు ప్రాంతంలో ఆధునిక యంత్రాల కొనుగో లుకు రైతులు దశాబ్దాల పాటు గుడివాడ ప్రాంతాలకు వెళ్లేవారు. అక్కడ వ్యవసాయానికి అవసరమైన గొర్రు సెట్లు, దమ్ము చక్రాలు, ట్రాక్టర్ ట్రాలీలు తయారీకి ఆర్డర్ ఇచ్చేవారు. తయారీ పూర్తయ్యాక సొంత ప్రాంతాలకు తీసుకురావడం వ్యయప్రయాసాలతో కూడుకు న్నది. కాలక్రమేణ గుడివాడ ప్రాంతంలోని యంత్రాల తయారీ నిపుణులే పిడుగురాళ్లలో తమ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. దీంతో సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని సుమారు 20 మండలాలకు సంబంధించిన రైతులు, ట్రాక్టర్ల యజమానులు తమకు కావాల్సిన యంత్ర పరికరాలను అనుకూలమైన రీతిలో పిడుగురాళ్లలోనే తయారు చేయించుకుంటున్నారు.

ఏమేమి తయారు చేస్తారంటే..

ట్రాక్టర్ ట్రాలీలు, దమ్ము చక్రాలు, గొర్రు సెట్లు, ట్రాక్టర్ బ్లేడు, విత్తన గొర్రు సెట్లు, ఎరువుల వాడకానికి ఉపయోగించే గొర్రు సెట్లు, ట్రాక్టర్ ట్రాలీపై వాటర్ ట్యాంకర్‌ను తయారు చేస్తారు. గుడివాడలో యంత్రాల తయారీలో నిపుణులైన సిబ్బందే పిడుగురాళ్లలో పరిశ్రమలు పెట్టి యంత్రాలను తయారుచేసి రైతులకు సకాలంలో అందిస్తున్నారు. ఏడాదిలో 8 నెలల పాటు ఊపిరి సలపని పని ఉంటుంది. సీజన్ బట్టి వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలతో పాటు జనవరి నుంచి మే నెల వరకు వాటర్ ట్యాంకర్లు తయారీలో ఇక్కడి సిబ్బంది తలమునకలవుతుంటారు.

రైతులకు ఉపయోగకరం..

గుడివాడ ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ యంత్రాలను తయారు చేయించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని. ఇప్పుడు అంతకన్నా తక్కువ ధరకే పిడుగురాళ్ల ప్రాంతంలోనే యంత్రా లు తయారు చేయడంతో పాటు కాలానుగుణంగా ఆధునిక యంత్రాలను కూడా రైతులకు అందించడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది.



నిజాంపట్నం హార్బర్‌లో వేటకు బయలుదేరేందుకు బోట్లలలో పూజలు నిర్వహిస్తున్న మత్స్యకారులు

వేట..మొదలు

● హార్బర్‌లో చేపలవేటకు పయనమైన గంగపుత్రులు

రేపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : గంగ పుత్రులు సోమవారం చేపల వేటకు బయలు దేరారు. తీర ప్రాంతంలో వేట విరామం ముగియటంతో గ్రామదేవతకు, బోట్లకు, సముద్ర తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేపల వేటకు పయనమయ్యారు. బాపట్లజిల్లాలో 80 కిలోమీటర్ల మేరా సముద్రతీరం ఉంది. మోటరైజ్డ్ బోట్లు 2,500ఉండగా, నాటుపడవలు 300, మెకనైజ్డ్‌బోట్లు 250ఉన్నాయి. తీరప్రాంతంలోని నిజాంపట్నం హార్బర్‌లో బోట్లు 300, ఇంజన్‌నావలు, మరపడవలు 350లు పైగానే ఉన్నాయి. సముద్రంలో వీరి వేట వారం పాటు కొనసాగుతుంది. దీనికి కావాల్సిన ఆహార పదార్థాలు, వేటకు కావాల్సిన సామగ్రిని వారి వెంట తీసుకెళ్లారు.



వేట విరామం అనంతరం చేపల వేటకు బయల్దేరిన బోట్లు,గంగపుత్రులు

చదువులకు.. శ్రీనిధి బాసట

● డ్వాక్రా మహిళల పిల్లలకు ప్రయోజనం

సత్తెనపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసా ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూప కల్పన చేసింది. వారి విద్యా వికాసానికి దోహద పడేందుకు కేవలం నాలుగు శాతం వడ్డీతో శ్రీనిధి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్‌టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసింది. సత్తెనపల్లి మండలంలో 1,785 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. మొత్తం 17,850 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల పిల్లలకు పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

చదువులకు.. రూ.లక్ష వరకు!

కేజీ నుంచి పీజీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేయనున్నారు. రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసమే ఉపయోగించాల్సి ఉంది. ఫీజు చెల్లింపులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్య, సామగ్రి తదితరాల కొనుగోలుకు వీటిని ఖర్చు చేయవచ్చు. నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉండే విద్యాలయాలకు వెళ్లేందుకు వీలుగా సైకిళ్ల కొనుగోలుకు సైతం అనుమతిస్తారు. ఎందుకు ఖర్చు చేశామన్న రసీదును శ్రీనిధి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. సంఘంలో ఉన్న సభ్యులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఒక్కో విద్యార్థికి అవసరాన్ని బట్టి రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు శ్రీనిధి బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చేలా ప్రతిపాదనలు చేశారు. ఈ మొత్తాన్ని రెండు నుంచి మూడు సంవత్సరాల్లో వాయిదా రూపంలో తిరిగి చెల్లించాలి.



కౌలు రైతు సుఖీభవ అనండి

(5వ పేజీ తరువాయి)

కూడా లేని వారి సంఖ్య మూడు లక్షలకు పైమాటే. మొత్తం సాగులో దాదాపు 60 శాతం వాటా కౌలు రైతులదే. ఇందులో రకరకాల కారణాలతో సీసీఆర్ కార్డులు అందుతున్నది సగం మందికే. ఈ సగం మంది కౌలు రైతులు కూడా బ్యాంకు రుణాల దగ్గర నుంచి విత్తనాల రాయితీ వరకు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు.

జిల్లాల వారీగా సీసీఆర్‌సీ లక్ష్యాలివి

ఈ ఏడాది సీసీఆర్ కార్డుల జారీ విషయంలో బాపట్ల జిల్లాలో లక్ష మంది కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు జారీ చేసింది 3,800 మాత్రమే. పల్నాడు జిల్లాలో 68 వేలు సీసీఆర్‌సీ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు రెండు వేలు లోపే ఉన్నాయి. అదే విధంగా గుంటూరు జిల్లాలో 55 వేలు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు మూడు వేలు లోపే ఉండడం గమనార్హం. ఖరీఫ్ మొదలయ్యే నాటికే ఈ సీసీఆర్ కార్డుల ప్రక్రియ పెద్ద ఎత్తున ప్రారంభం కావాల్సి ఉండగా ఆ దిశగా వ్యవస్థలు సన్నద్ధం కాకపోవడం కూడా కౌలు రైతులకు శాపంగా మారింది.

సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే..

అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయడానికి సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే అదే విష యాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అసలు మార్గదర్శ కాలలో కౌలు రైతుల ఊసే లేకపోవడం మరింత గందరగోళ పరుస్తుందని వాపోతున్నారు. గతేడాది జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డుల్లో జూలై మొదలుకుని నవంబరు చివరి వరకు వ్యాలిడిటీ ఉన్న కార్డుల సంఖ్య దాదాపు 50 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 11 నెలల కాల పరిమితితో ఇచ్చే సీసీఆర్ కార్డులను గతేడాది జూలై నుంచి నవంబరు వరకు కౌలు రైతులకు ఇస్తూనే ఉండ డంతో గడువు ఉన్న కార్డులు ఇంకా గణనీయంగానే ఉన్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతు న్నాయి. వీటితోపాటు ఈ ఏడాది జారీ చేసిన కొత్త కార్డులు కూడా మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికే పదివేల వరకు ఉన్నాయి.

పొంతనలేని సమాధానాలు

సీసీఆర్ కార్డుల వ్యాలిడిటీ విషయంలో యంత్రాంగం వైపు నుంచే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. గతేడాది జారీ చేసిన కార్డులకు గడువు ఉన్నప్పటికీ దానితో సంబంధం లేదని ఇప్పుడు కొత్తగా జారీ చేసేవే ప్రామాణికమని చెబుతన్నారు. మరోవైపు ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగడానికి కారణం ఇంకా కాలపరిమితి ఉండడాన్ని యంత్రాంగం చూపిస్తోంది. ప్రస్తుతం మనుగడలో ఉన్న సీసీఆర్ కార్డులను ఎనేబుల్ చేయడానికి తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, సొంత పొలం యజమానుల వివరాలే పంపమన్నారని అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక కష్టాలు

అన్నదాత సుఖీభవ పథకం అర్హతకు సంబంధించి పలు సాంకేతిక చిక్కులు భూ యజమానులను వెంటాడుతున్నాయి. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్త రీ-సర్వే వల్ల వేల సంఖ్యలో భూ రికార్డులు తహసీల్దార్ల లాగిన్‌లకు చేరాయి. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని సమాచారం. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ చేయించుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గత ప్రభుత్వంలో ఈ విధానంతో పాటు మొబైల్‌కు ఓటీపీ పంపి కూడా ప్రక్రియ పూర్తి చేయడంతో అన్నదాతలకు సులువుగా ఉండేది. ఇప్పుడు ఒక్క బయోమెట్రిక్ విధానాన్నే అమలు చేస్తుండగా పలు చోట్ల సర్వర్ సమస్యలతో రైతులు గంటల తరబడి పనులు మానుకుని నిరీక్షించాల్సి వస్తోంది.

సమగ్ర విచారణ జరపండి

● చిలకలూరిపేట మునిసిపాలిటీలో రూ.34 లక్షల కుంభకోణంపై ఎంపీ లావు లేఖ

చిలకలూరిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపా లిటీలో జరిగిన రూ.34 లక్షల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపిం చాలని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రికి లేఖ రాశారు. సోమవారం వివరాలను వెల్లడించారు. కుంభకోణానికి బాధ్యులైన వారిపై చర్యలతో పాటు ఆ మొత్తాన్ని రాబట్టి మున్సిపల్ ఖజానాకు జమచేయించాలని ఎంపీ కోరారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ కోరుతూ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని రాసిన లేఖను కూడా ఆయన మంత్రి నారాయణకు పంపించారు.



చిలకలూరిపేట మునిసిపల్ కార్యాలయం

అసలేం జరిగిందంటే...

వైసీపీ హయాంలో చిలకలూరిపేట మునిసిపాలిటీలో ఈ కుంభకోణం జరిగింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగాభవాని అనే మహిళ ఈ వ్యవహారానికి ప్రధాన బాధ్యురాలిగా గుర్తించారు. ఆమెపై పోలీసు కేసు నమోదుకావడంతో.. చాలా కాలంగా పరారీలో ఉంది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.34,34,397 కాజేశారు. అనేక సార్లు ఈ అంశం చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు వచ్చింది. దీనిపై వివరాలు వెల్లడించాలని టీడీపీ కౌన్సిలర్లు అధికారులను గట్టిగా నిలదీశారు. కానీ, అధికారులు స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపారు. ఈలోగా కాజేసిన మొత్తంలో రూ.12 లక్షలు ఖజానాకు జమ అయ్యాయి. ఇంకా రూ.22 లక్షలకు పైగా జమ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిపై దృష్టి సారించారు. అనంతరం ఈ కుంభకోణంపై ప్రాథమిక విచారణ జరిగింది. మొత్తం 15 మంది మునిసిపల్ సిబ్బంది దీనికి బాధ్యులని విచారణలో తేల్చారు. వీరిలో ఒకరు చనిపోయారు. పలువురు వేర్వేరు మునిసిపాలిటీలకు బదిలీ అయ్యారు. అందులో బాధ్యులైన పది మందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో నలుగురు ఉన్నతాధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

సచివాలయ ఉద్యోగుల.. బదిలీలకు శ్రీకారం!

(5వ పేజీ తరువాయి)

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో అధికా ప్రాధాన్యం ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నచోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. కాగా బదిలీపై వెళ్లే ముందు ఉద్యోగులు వారి బకాయిలను చెల్లించాలి. ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ అయినవారు తప్పనిసరిగా విధుల్లో లేకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

● షెడ్యూల్ ఇలా..

సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 16న ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీ నాటికి పూర్తి కావాలని నిర్దేశించింది.

తేదీ	ప్రక్రియ
జూన్ 15-16	ఉద్యోగి వివరాల నమోదు
జూన్ 16- 18	ఖాళీల నమోదు
జూన్ 22- 24	బదిలీలకు దరఖాస్తులు
జూన్ 25- 29	దరఖాస్తుల పరిశీలన- ఉత్తర్వుల జారీ
జూన్ 30(చివరిరోజు)	అభ్యంతరాల పరిష్కారం
జూన్ 30	అన్ని బదిలీలను పూర్తి చేయాలి
జూలై 10	ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలి

అసాంఘికానికి.. రహదారి

● పట్టణ బైపాస్‌లో మద్యం సేవించి, బాటిళ్లతో వీరంగం


మాచర్లటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఔటర్ బైపాస్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీశైలం రోడ్డులోని విశ్వ బ్రాహ్మణ కాలనీ నుంచి గుంటూరు రోడ్డులోని శివప్రియ నగర్ వరకు సుమారు 8 కిలోమీటర్లు.. రెండు ఫ్లైఓవర్లు, చంద్రవంకపై హైలెవల్ బ్రిడ్జితో రహదారిని రూ. 89 కోట్లతో శరవేగంగా నిర్మిస్తున్నారు. రైల్వే ట్రాక్ బ్రిడ్జి తప్ప మిగతా పనులు పూర్తయ్యాయి. ఈ రహదారి విశాలంగా, నిర్మానుష్యంగా ఉండడంతో చీకటి పడితే చాలు మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తూ.. ఖాళీ సీసాలను రోడ్డుపైనే పగలగొడుతున్నారు. ఎక్కడ చూసినా గాజు పెంకులే కనిపిస్తున్నాయి. గంజాయి వంటివి సేవించి ఘర్షణలకు కూడా దిగుతున్నారు. వాకింగ్ చేసే వారు అక్కడి వాతావరణం చూసి భయపడుతున్నారు. సమీప పొలాల రైతులు పొలం పనులు ముగించుకొని చీకటి పడ్డాక బైపాస్ దాటి పట్టణంలోకి ప్రవేశించాలంటేనే హడలిపోతున్నారు. పట్టణానికి ఆవలి వైపున ఉన్న బైపాస్ పోలీసులకు సవాల్‌గా మారింది. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు రాత్రిళ్లు డ్రోన్ సాయంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై మందుబాబులు తాగి వదిలేసిన సీసాలు, గాజు ముక్కలు









గూడేలలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

సీఎండీ పుల్లారెడ్డిని కోరిన ఎరిక్షన్‌బాబు



సీఎండీని కలిసిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచుల గూడేలలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసి వెలుగులు నింపాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. ఈ మేరకు ఆయన విద్యుత్ శాఖ సీఎండీ పీ పుల్లారెడ్డిని సోమవారం విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. వైపాలెం నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని అందుకు అవసరమైన సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని, ఎక్కువ శాతం నల్లమల అటవీ ప్రాంతాలలో చెంచులుండే గూడేలలో విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు అటవీశాఖ అధికారుల అనుమతులు ఉండవని ఎరిక్షన్‌బాబు వివరించారు. అందుకు ప్రత్యామ్నాయంగా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి గూడెం వాసుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. వ్యవసాయానికి కూడా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలన్నింటిపైనా సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమణబాబు



గిద్దలూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబును ఇటీవల ప్రభుత్వం నియమించడంతో రమణబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఐ.శ్రీనివాసులు పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

ముండ్లమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓగ్రామానికి చెందిన మహిళను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి నసంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి సుధాకర్‌పై సోమవారం ఛీటింగ్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.కమలాకర్ తెలిపారు. సదరు యువతితో సుధాకర్ సహజీవనం కూడా చేశారు. ఈక్రమంలో పెళ్లికి నిరాకరించటంతో బాధితురాలు తనకు న్యా యం చేయాలని ముండ్లమూరు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రేపటినుంచి అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ మూలవిరాట్

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీఅచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 22 వరకు జరగనున్నాయి. మండలంలోని బొట్లగూడూరు పం చాయతి రఘునాథపురం, కమ్మవారిపాలెం గ్రామల సరిహద్దుల్లో వెలసియున్న అచ్చ మాంబ కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధిగాం చింది. అచ్చమాంబను పూజిస్తే సంతానం కలుగుతుందని, అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మ కం. బుధవారం పసుపుకుంకుమ, సారేకావేళ్ల, గురువారం గణపతి పూజ, పుణ్యాహాచనం, గ్రామ ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం అమ్మ వారికి అభిషేకం, గ్రామ ఉత్సవం, శనివారం వెంగమనాయుడు సమేత అచ్చమాంబ పేరంటాలు, అమ్మవారికి కల్యాణం, ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆయన రూటే సప‘రేటు’

జలవనరుల శాఖలో అవినీతి జలగ

చేతులు తడపందే ఫైళ్లు కదలవు

మధ్యాహ్నం 12 దాటితే ఆఫీసే బార్



జలవనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

మార్కాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో ఆ కార్యాలయం వైపు తొంగి చూసిన కాంట్రాక్టర్ లేరు. కానీ గత సంవత్సరం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పరిస్థితి మారింది. జలవనరుల శాఖ కార్యాలయం కళ కూడా మారింది. డివిజన్ మొత్తం చెరువుల ఆధునికీకరణకు ప్రభుత్వం సమృద్ధిగా నిధులు కేటాయించింది. దీంతో మళ్లీ కాంట్రాక్టర్‌లతో ఆ కార్యాలయంలో కళ కళలాడుతోంది. ఇదే అదునుగా భావించారు డివిజన్ ఈఈ కార్యాలయంలో పనిచేసే ఓ కీలక ఉద్యోగి. రెగ్యులర్ అధికారి ఎవరూ అందుబాటులో లేకపోవడంతో పోస్టు చిన్నదే అయినా అతను చెప్పిందే వేదంగా మారింది. అతని ప్రమేయం లేనిదే ఎలాంటి ఫైళ్లయినా ఆఫీసులోంచి కదలవు. డీఈ స్థాయి అధికారులు కూడా అతను చెప్పినట్లు వినాల్సిందే. ఉద్యోగుల యూనియన్‌లో కూడా కీలకమైన పదవుల్లో ఉండడంతో అతని జోలికి వెళ్లే సాహసం ఎవరూ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన చిన్నపాటి కాంట్రాక్టర్‌ల వద్ద కూడా ముక్కుపిండి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అది ఎంతటి పనైనా లెక్కకట్టి అతనికి సమర్పించుకోవాల్సిందే. మధ్యవర్తులు, దళారులతో పనిలేకుండా నేరుగా లంచం తీసుకోవడం ఆయన నైజం. అంతేకాక మధ్యాహ్నం అయిందంటే చాలు అతని కార్యాలయాన్ని బార్‌గా మార్చుకోవడం పరిపాటిగా మారింది. అతని ఆఫీస్ ర్యాకుల్లో ఎప్పుడూ మద్యం సీసాలు దర్శనమిస్తుంటాయి. ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోవడం, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అతను ఏం చేసినా సాగిపోతోందని కార్యాలయంలో పలువురు ఉద్యోగులు చెప్తున్నారు. ఒకసారి ఎస్ఈ కార్యాలయానికి బిల్లు కోసం పంపిన ఫైలు వెనక్కి వచ్చింది. దానిని మళ్లీ పంపేందుకు కూడా లంచం డిమాండ్ చేయడంతోనే కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. వ్యవహారంలోనే డబ్బులు తీసుకుంటూ సదరు ఉద్యోగి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

ఎంతటి వారైనా కప్పం కట్టందే ఫైళ్లు కదలవు

మార్కాపురం జలవనరుల శాఖ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాకి శ్రీనివాసరావు అవినీతికి కేరాఫ్‌గా మారారు. డివిజన్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పని జరిగినా ఆయన వద్ద నుంచే ఫైళ్లు ఉన్నతాధికారుల టేబుల్‌ల మీదికు వెళ్లాలి. పని దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో ముందుగా పర్సంటేజీల విషయమై డీల్ కుదుర్చుకునేది ఆయనే. అన్నీ అనుకున్నట్లు కాంట్రాక్టర్ చేయి తడిపితే ఫైళ్లు ముందుకు కదిలి బిల్లులు వస్తాయి. ఏ మాత్రం ఆయన్ని పట్టించుకోకపోయినా, లెక్క తగ్గినా ఇక అంతే సంగతులు. నెలలు, సంవత్సరాలు గడిచినా బిల్లులు రాకుండా కొర్రీలు వేయగల సమర్థుడు. దీంతోనే అతనంటే కాంట్రాక్టర్లు హడలెత్తి పోతున్నారు. ప్రస్తుతం ఇరిగేషన్ పనులకు సంబంధించి 15 నుంచి 20 శాతం పర్సంటేజీలు నడుస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్‌ల వద్ద లంచాలు తీసుకోవడం ఒక ఎత్తైతే చివరికి అధికారులను కూడా ఆయన వదల్లేదని తెలుస్తోంది. ఈ మధ్యనే మార్కాపురం వచ్చిన ఓ అధికారికి సంబంధించిన ఇంక్రిమెంట్ల బిల్లుల ఫైళ్లు ఉన్నతాకారులకు పంపడానికి కూడా లంచం డిమాండ్ చేసినట్లు ఆఫీసు వర్గాలు తెలిపాయి. వాస్తవానికి చాలా చిన్నపనే అయినా సబ్ డివిజన్ స్థాయి అధికారి అయిన ఆయన రూ.15వేలు లంచం ఇవ్వందే ఫైలు పంపనట్లు తెలిసింది. తిలాపాపం తలా గరిటెడులా పర్సంటేజీల్లో అన్ని స్థాయిల అధికారులకు వాటాలు ఉండడంతోనే అతను చెప్పినట్లే నడుస్తున్నట్లు తెలుస్తోంది.

మధ్యాహ్నం అయితే మద్యం పరవళ్లు

పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు చేయించుకునేందుకు కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేయడం సహజం. ఈ క్రమంలో కీలకమైన ఆ ఉద్యోగి వద్దకు వెళ్తే సర్పంటేజీలతోపాటు మద్యం సీసాలు కూడా ఇవ్వాల్సిందే. మధ్యాహ్నం 12.00 గంటలు దాటితే అతని కార్యాలయం బార్‌గా మారిపోవడం పరిపాటి. ఆఫీస్ టేబుల్‌పైనే ఉద్యోగుల యూనియన్‌లోని సహచరులు, కాంట్రాక్టర్‌లతో కలిసి పనివేళల్లోనే పూటుగా మద్యం తాగడం అతని ఆనవాయితీ. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులు మందలించినా పరిస్థితిలో మార్పురాలేదని కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి. ఏసీబీ అధికారులు సోమవారం చేసిన దాడుల్లో కూడా కొన్ని సీసాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం.

శరవేగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం



అద్దంకిలోని ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం రెండు సబ్‌స్టేషన్లను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గత నెల 30 న వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణ లో 6.7 కోట్ల రూపాయలతో సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్, శింగరకొండ రోడ్డు లోని ద్వారకానగర్ వద్ద 4.5 కోట్ల రూపాయలతో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే అత్యధిక శాతం నిర్మాణ పనులు పూర్తి కాగా, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటికి అనుసంధానంగా విద్యుత్‌లైన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఎస్‌పీ కాలనీలోని సబ్‌స్టేషన్ ద్వారా శ్రీనగర్, రామ్‌నగర్, నర్రావారిపాలెం, గాంధీబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలకు, ద్వారకానగర్ వద్ద ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ ద్వారా అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్, పాత దామావారి పాలెం, దర్శి రోడ్లలోని వివిధ ప్రాంతాలతో పాటు అద్దంకి పట్టణానికి మంచి నీటి పంపింగ్ చేసే గుండ్లకమ్మనది లోని ఊటబావుల మోటార్‌లకు, మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాలకు తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం కలుగుతుంది.

కనీసం మరో దశాబ్దకాలం పాటు లో ఓల్టేజ్ సమస్య లేకుండా ఉండే విధంగా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలో అద్దంకి పట్టణ విద్యుత్ వినియోగదారులకు లో-వోల్టేజీ సమస్య నుండి విముక్తి కలగనుంది.

వసతి గృహంలో.. కొరవడిన పర్యవేక్షణ

- **ఏడాదిగా వార్డన్ పోస్టు ఖాళీ**
- **పట్టించుకోని అధికారులు**



ఎస్సీ-2 బాలుర హాస్టల్ భవనం

దొనకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ-2 బాలుర వసతి గృహంలో గత ఏడాది బాధ్యతలు చేపట్టిన సంక్షేమాధికారి మెడికల్ లీవ్‌పెట్టి వెళ్లారు. దీంతో ఏడాదిగా ఇన్‌చార్జ్‌తో కొనసాగుతోంది. ఎస్సీ-1 బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవటంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం ఏర్పాటుచేసిన వసతి గృహానికి రెగ్యులర్ అధికారిని నియమించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంక్షేమాధికారులకు జరిగిన బదిలీల్లోనూ ఇక్కడి అధికారిని నియమించలేదు. పాఠశాలలు పునఃప్రారంభమై విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్న సమయంలో ఒకే సంక్షేమాధికారి రెండుచోట్ల విద్యార్థులను పర్యవేక్షించటం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. అలాగే, బీసీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి ఇటీవల బదిలీ అయ్యారు. బీసీ బాలికల వసతి గృహం సంక్షేమాధికారిణికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ-2 బాలుర హాస్టల్‌కు, బీసీ బాలుర హాస్టల్‌కు రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వేధిస్తున్న సర్వర్ సమస్య

- **ఇబ్బందులు పడుతున్న ప్రజలు**



లబ్ధిదారులతో కిటకిటలాడుతున్న గ్రామ సచివాలయాలు

పామూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకు గ్రామ సచివాలయాలకు వెళుతున్న లబ్ధిదారులకు సర్వర్ సమస్య వేధిస్తున్నది. తల్లికి వందనం అర్హత, అనర్హత, జాబితాల్లో పేర్లు ఉన్నవాళ్లకు నగదు పడకపోవడంతో పిల్లలతో సహా తల్లులు సచివాలయ కేంద్రాలకు తరలివస్తున్నారు. అందుకు సరైన సమాధానం చెప్పేనాథుడు లేకపోవడంతో ఎంచేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అలాగే, విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు, రైస్ కార్డులు దరఖాస్తులు చేసుకొనేందుకు సైట్ ఓపెన్ కావడంలేదు,

కాగా, విద్యార్థులు నూతనంగా పాఠశాలల్లో చేరేందుకు కావలసిన కుల ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో సచి వాలయా లు కిటకిటలాడుతున్నాయి. సర్వర్ సమస్య వేధిస్తుండటంతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

కౌలు రైతు సుఖీభవ అనండి

(5వ పేజీ తరువాయి)

కూడా లేని వారి సంఖ్య మూడు లక్షలకు పైమాటే. మొత్తం సాగులో దాదాపు 60 శాతం వాటా కౌలు రైతులదే. ఇందులో రకరకాల కారణాలతో సీసీఆర్ కార్డులు అందుతున్నది సగం మందికే. ఈ సగం మంది కౌలు రైతులు కూడా బ్యాంకు రుణాల దగ్గర నుంచి విత్తనాల రాయితీ వరకు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు.

జిల్లాల వారీగా సీసీఆర్‌సీ లక్ష్యాలివి

ఈ ఏడాది సీసీఆర్ కార్డుల జారీ విషయంలో బాపట్ల జిల్లాలో లక్ష మంది కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు జారీ చేసింది 3,800 మాత్రమే. పల్నాడు జిల్లాలో 68 వేలు సీసీఆర్‌సీ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు రెండు వేలు లోపే ఉన్నాయి. అదే విధంగా గుంటూరు జిల్లాలో 55 వేలు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికీ జారీ చేసిన కార్డులు మూడు వేలు లోపే ఉండడం గమనార్హం. ఖరీఫ్ మొదలయ్యే నాటికే ఈ సీసీఆర్ కార్డుల ప్రక్రియ పెద్ద ఎత్తున ప్రారంభం కావాల్సి ఉండగా ఆ దిశగా వ్యవస్థలు సన్నద్ధం కాకపోవడం కూడా కౌలు రైతులకు శాపంగా మారింది.

సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే..

అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింప చేయడానికి సీసీఆర్ కార్డులే ప్రామాణికమైతే అదే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అసలు మార్గదర్శకాలలో కౌలు రైతుల ఊసే లేకపోవడం మరింత గందరగోళ పరుస్తుందని వాపోతున్నారు. గతేడాది జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డుల్లో జూలై మొదలుకుని నవంబరు చివరి వరకు వ్యాలిడిటీ ఉన్న కార్డుల సంఖ్య దాదాపు 50 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 11 నెలల కాల పరిమితితో ఇచ్చే సీసీఆర్ కార్డులను గతేడాది జూలై నుంచి నవంబరు వరకు కౌలు రైతులకు ఇస్తూనే ఉండడంతో గడువు ఉన్న కార్డులు ఇంకా గణనీయంగానే ఉన్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు ఈ ఏడాది జారీ చేసిన కొత్త కార్డులు కూడా మూడు జిల్లాల పరిధిలో ఇప్పటికే పదివేల వరకు ఉన్నాయి.

పొంతనలేని సమాధానాలు

సీసీఆర్ కార్డుల వ్యాలిడిటీ విషయంలో యంత్రాంగం వైపు నుంచే పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. గతేడాది జారీ చేసిన కార్డులకు గడువు ఉన్నప్పటికీ దానితో సంబంధం లేదని ఇప్పుడు కొత్తగా జారీ చేసేవే ప్రామాణికమని చెబుతున్నారు. మరోవైపు ఈ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగడానికి కారణం ఇంకా కాలపరిమితి ఉండడాన్ని యంత్రాంగం చూపిస్తోంది. ప్రస్తుతం మనుగడలో ఉన్న సీసీఆర్ కార్డులను ఎనేబుల్ చేయడానికి తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, సొంత పొలం యజమానుల వివరాలే పంపమన్నారని అధికారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న సాంకేతిక కష్టాలు

అన్నదాత సుఖీభవ పథకం అర్హతకు సంబంధించి పలు సాంకేతిక చిక్కులు భూ యజమానులను వెంటాడుతున్నాయి. వైసీపీ చేపట్టిన అస్తవ్యస్త రీ-సర్వే వల్ల వేల సంఖ్యలో భూ రికార్డులు తహసీల్దార్ల లాగిన్‌లకు చేరాయి. వీటి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని సమాచారం. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ చేయించుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గత ప్రభుత్వంలో ఈ విధానంతో పాటు మొబైల్‌కు ఓటీపీ పంపి కూడా ప్రక్రియ పూర్తి చేయడంతో అన్నదాతలకు సులువుగా ఉండేది. ఇప్పుడు ఒక్క బయోమెట్రిక్ విధానాన్నే అమలు చేస్తుండగా పలు చోట్ల సర్వర్ సమస్యలతో రైతులు గంటల తరబడి పనులు మానుకుని నిరీక్షించాల్సి వస్తోంది.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

అవీఇవీ



ఉదయ్‌క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న కడవకుదురు హెచ్‌ఎం ఉపాధ్యాయులు

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : యూపీఎస్‌సీ సివిల్ సర్వీస్ ఆల్ ఇండియా స్థాయిలో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డిని కడవకుదురు జడ్పీ పాఠశాల ఆవరణలో కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం కడవకుదురు జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయకృష్ణారెడ్డి, పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధికమించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం. కే.శ్రీనివాసరెడ్డి, కడవకుదురు, చినగంజాం జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆనందం అంతలోనే ఆవిరి

- **పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి వస్తుండగా ప్రమాదం**
- **బైక్‌పై నుంచి పడిన తల్లి మీదుగా వెళ్లిన టిప్పరు**
- **చికిత్స పొందుతూ మృతి**
- **బావురు మంటున్నపిల్లలు**

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమై పిల్లలకు పుస్తకాలు కొనిచ్చి ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో తల్లి మృతి చెదింది.దీంతో పిల్లలు బావురు మంటున్నారు. పుస్తకాలు కొనిచ్చిన ఆనందం ఇంటికి పోయేవరకు కూడా లేదు. మృత్యు రూపంలో వచ్చిన టిప్పర్ ఆ కుటుంబంలో విషాదం నింపిది. వివరాలలోకి వెళితే స్థానిక ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న షేక్ దిల్‌షాద్ (28)రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈదుర్ఘటన సోమవారం స్థానిక కర్నూల్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు దిల్‌షాద్ అమె భర్త అబుబాకర్ తన ఇద్దరి పిల్లలను తీసుకొని వెళ్లి పుస్తకాలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఇంటికి తిరిగి మోటర్‌బైక్‌పై నలుగురు ప్రయాణిస్తున్నారు. కర్నూల్ ఫ్లై వోవర్ బ్రిడ్జి వద్ద మోటర్‌బైక్‌పై నుంచి వెనుక కూర్చున్న దిల్‌షాద్ జారి రోడ్డు మీద పడింది. దీంతో వెనుక నుంచి వచ్చి చీమకుర్తి వైపు వెళ్లే టిప్పరు అమె కాళ్లపై నుంచి వెళ్లింది. వెంటనే దిల్‌షాద్‌ను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుదూ అమె మృతి చెందింది. ఈమేరకు ఒంగోలుతాలుకా ఎస్సై హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాధువు వేషంలో దోపిడీలు

- **పోలీసుల అదుపులో దుండగుడు**
- **నెలరోజులుగా ఒంగోలు లాడ్జిలో మకాం**

ఒంగోలు క్రైం,జూన్16(ఆంధ్రజ్యోతి): సాధువు వేషంలో తిరుగుతూ మహిళలను మోసం చేసి దోపిడీలకు పాల్పడే దుండగుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చీమకుర్తిలో ఆదివారం సాధువు వేషంలో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వెళ్ళి అమెకు మాయమాటలు చెప్పి దాడి చేసి పరారయ్యాడు. అయితే అమె ఇంట్లోకి వెళ్లే సమయంలో సాధువులా వెళ్ళి అక్కడ దోపిడీకి పాల్పడిన తరువాత ప్యాంట్, టీషర్టుతో బయటకు వచ్చినట్లు పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించారు. దీంతో అతను ఒంగోలువైపు వచ్చినట్లు కూడా ఆధారాలు సేకరించి, ఆదివారం ఒంగోలులోని ఓ లాడ్జిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంకు చెందిన యువకుడు నెలరోజులుగా ఒంగోలులో లాడ్జిలో మకాం వేసి పరిసరప్రాంతాలలో సాధువులా వెళ్లి మహిళలకు మాయమాటలు చెప్పి దోపిడీలకు పాల్పడుతుంటాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

- **విచారించాలని కలెక్టర్‌కు వినతి**

సంతనూతలపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో గత ప్రభుత్వ యాంలో మండలపరిషత్ నిధుల దుర్వినియోగంపై సోమవారం కలెక్టర్‌కు సంతనూతలపాడుకు చెందిన మందాడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలపరిషత్ కార్యాలయపు ఖర్చు పేరుతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులను లక్షల్లో దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతనూతలపాడులో వాకింగ్ ట్రాకింగ్ పేరుతో, పార్కు ఎక్యూప్‌మెంట్ పేరుతో రూ.9,23,500 నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వకార్యాలయాలకు మరమ్మతుల పేరుతో రూ.11,49,600లను దుర్వినియోగం చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ యార్డు నుంచి చిన్నచెరువు వరకు , హైస్కూల్ దగ్గర కల్వర్టర్ మరమ్మతుల పేరుతో రూ.4,02,900 నిధులను, పశువుల ఆసుపత్రి నుంచి ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాల వరకు రోడ్డు వెడల్పు పేరుతో చేసిన పనికి మళ్లీ చేసినట్లు అదేవిధంగా ఎనికపాడు డొంక రోడ్డు కూడా చేసిన పని మళ్లీ చేసినట్లు చూపి, రూ.9,34,600 స్వాహాచేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం!

(5వ పేజీ తరువాయి)

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సంబంధిత సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో అధికా ప్రాధాన్యం ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నచోటికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. కాగా బదిలీపై వెళ్లే ముందు ఉద్యోగులు వారి బకాయిలను చెల్లించాలి. ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ అయినవారు తప్పనిసరిగా విధుల్లో లేకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

● షెడ్యూల్ ఇలా..

సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 16న ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీ నాటికి పూర్తి కావాలని నిర్దేశించింది.

తేదీ	ప్రక్రియ
జూన్ 15-16	ఉద్యోగి వివరాల నమోదు
జూన్ 16- 18	ఖాళీల నమోదు
జూన్ 22- 24	బదిలీలకు దరఖాస్తులు
జూన్ 25- 29	దరఖాస్తుల పరిశీలన- ఉత్తర్వుల జారీ
జూన్ 30(చివరిరోజు)	అభ్యంతరాల పరిష్కారం
జూన్ 30	అన్ని బదిలీలను పూర్తి చేయాలి
జూలై 10	ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలి

కంపుకొడుతున్న మార్టూరు కూడలి

- రోడ్డుపైనే నిలుస్తున్న మురుగునీరు
- ఇరువైపుల సైడ్‌డ్రైన్లు లేకపోవడంతో అవస్థలు
- వర్షాకాలంలో మరింత జఠిలం

మార్టూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్య వైఖరితో మార్టూరు కూడలి దుర్గంధభరితంగా మారుతోంది. రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఆ నీటిపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు పడమర వైపు ఉన్న సైడు కాల్వల నుంచి మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతోపాటు తూర్పు వైపున కూడా సైడు కాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. ఇక ఒక మోస్తరు వానకురిసిందంటే రోడ్డుపక్కన సర్వీసు రోడ్డు పైనే కాకుండా, ఏకంగా జాతీయరహదారి పైనే నీళ్లు భారీగా నిలుస్తున్నాయి. నాగరాజుపల్లి కూడలి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో చాలా చోట్ల మురుగునీరు నిలబడుతోంది. అదేవిధంగా మార్టూరులో కొణిదెనరోడ్డు, నాగరాజుపల్లి రోడ్లలోని మిని అండరు పాస్‌లలో కూడా మురుగునీరు బయటకువెళ్లే దారిలేదు. దీంతో దుర్వాసన వస్తుండడంతో పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానికితోడు సర్వీసు రోడ్డు పక్కన ఉన్న చికెన్ దుకాణాలు వారు, ఇతరత్రా దుకాణాలు వారు తమదుకాణాలు నుంచి వచ్చే కలుషితనీటిని, మురుగునీటిని రోడ్డుపైకి వెళ్లే విధంగా రోడ్డును పగలగొట్టి తూము ఏర్పాటు చేశారు. దీంతో ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా, సర్వీసురోడ్డులలో రోడ్డును పగలగొట్టిన సంఘటనలు ఉన్నాయి. వానలు కురిసి, రోడ్డుపైన నీళ్లు నిలబడినసమయంలో వాహనదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియక, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగునీరు రోడ్డుపైన నిలబడకుండా, సైడుకాల్వల్లో సక్రమంగా మురుగునీరు పారేవిధంగా జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజానికం కోరుతున్నారు.


మార్టూరు సెంటర్లో రోడ్డుపైన నిలిచిన మురుగునీరు


మార్టూరులో పెద్ద అండరుపాస్ వద్ద నిలబడిన మురుగునీరు

నామ్ రోడ్డులో పెరిగిన ప్రమాదాలు

అద్దంకి, జూన్16 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. దీంతో కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొంత మంది గాయాలబారిన పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు స్థానికులను, వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ప్రతినిధులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అద్దంకి పట్టణంలో వాహనాల వేగ నియంత్రణకు తీసుకున్న చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో మరింత వేగంగా వెళ్తున్నాయి. ప్రధానంగా అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్, అంబేద్కర్‌బొమ్మ కూడలి, పాతబస్టాండ్ కూడలి, ఆర్టీసీ బస్టాండ్, పోతురాజు గండి, భవానీసెంటర్, కలవకూరు క్రాస్ రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద రోడ్డు దాటే వాహనచోదకులు, పాదచారులు ఎక్కువగా ఉంటారు. ఈ నేపథ్యంలో వేగ నియం త్రణ తెలియజేసే విధంగా, ఎంతవేగంతో వెళ్లాలో తెలిపే విధంగా రోడ్డు అంచుల్లో ఆయా ప్రాంతాలలో బోర్డులు ఏర్పాటు చేస్తే కొంతమేర ప్రమాదాలు తగ్గుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భవానీసెంటర్‌లో స్పీడుబ్రేకర్లు ఉండడం, మలుపుకావడంతో వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. ప్రధానంగా రామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, కలవకూరు క్రాస్‌రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్ల వద్ద స్పీడు బ్రేకర్ లు ఏర్పాటు చేయడంతో పాటు తగు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఇప్పటికే పోలీస్ అధికారులు నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ అధికారుల దృష్టికి తీసుకు పోయినా స్పందన లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా స్పందించి స్పీడు బ్రేకర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పట్టణంలోని రామ్‌నగర్ వద్ద నామ్ రోడ్డును దాటుతున్న గేదెలు

పశుపోషకుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించండి

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణపై ఆధారపడి జీవించేవారు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉన్నారని, వారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో పశు వైద్య విభాగం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో పారదర్శకంగా సేవలు అందించి ప్రజలకు సహకరించాలని సూచించారు. అలాగే సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించి సిబ్బంది కొరత ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సమస్యలను గుర్తించి ఈనెల 21న స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. ఇందులో సుమారు 40కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010368533, 7799469699 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలలో సంతృప్తి

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు అందిస్తున్న పథకాలతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. వాడరేవు మత్స్యకార 100 కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలతో వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలతో అయోమయంలో ఉన్న ప్రజలకు కూటమి ప్రభుత్వంతో ఉత్సాహం అందిందన్నారు. ఒకవైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమంతో ప్రజాపార్టీగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వాడరేవులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతలక్ష్మి


వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటి అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి కోరారు. సోమవారం అమరావతిలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డిని తన కార్యాలయంలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటి సభ్యులు కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా కూరగాయలు, వంటగ్యాస్ చార్జీలు పెంచాలన్నారు. అనారోగ్యంతో కొంతమంది యాప్‌ల భారంతో పని చేయలేక పోతున్నారని, ఇలాంటి వారికి వలంటరీ రిటర్మెంట్ అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి లక్ష్మినరసమ్మ, హేమలత, కల్యాణి, కాత్యాయని ఉన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల గుర్తింపు

పంగులూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 7,113 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరనుందని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. రిజిస్టర్ కాబడిన రైతుల తుది జాబితాను ఆయా రైతుసేవాకేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. వీరిలో 6,881 మంది రైతులకు సంబంధించి ఈ కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన 232 మంది రైతులు ఈ నెల 20లోగా సంబంధిత రైతుసేవాకేంద్రాలలో ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. రైతుసేవాకేంద్రాలలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

మేదరమెట్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి)మేదరమెట్లలో వేంచేసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి 41వ వార్షిక బ్రహ్మోత్సవాలను నాల్గవ రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, విశేష పూజలు, లక్ష్మీగణపతి హోమాన్ని పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యాచార్యులు, ఆలయ పూజారి అగ్నిహోత్రం హయగ్రీవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.దివంగత అరవపల్లి ప్రసాద్ కుమారులు కృష్ణ సుబ్బారావు, నిడమానూరి వెంకటేశ్వర్లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పాదర్తి కాజారావు, మద్దాలి సంజీవరావు,ఆదూరి ప్రసాద్, పేరకం శ్రీను,మద్దాలి రాఘవరావు,మునగంటి వీర భద్రాచారి, గొల్ల సుబ్బారావు, అరవపల్లి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం డబ్బులు డ్రా చేసేందుకు బారులు

పోస్టాఫీస్, బ్యాంకుల్లో మహిళలు బారులు

అద్దంకి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలలో ప్రభుత్వం తల్లికి వందనం నగదు జమ చేసింది. అయితే వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవులు కావడంతో సోమవారం అత్యధిక శాతం మంది మహిళలు డబ్బులు డ్రా చేసేందుకు పోస్టాఫీస్, బ్యాంకులకు వెళ్లారు. దీంతో పోస్టాఫీస్, పలు బ్యాంకుల వద్ద రద్దీ పెరిగింది. ఎక్కడ చూసినా తల్లికి వందనం డబ్బులు డ్రా చేసేందుకు వచ్చిన మహిళలలే ఉన్నారు.. ఎలాగు వచ్చాము కదా అని పలువురు మహిళలు గంటల కొద్ది వేచి ఉండి నగదు డ్రా చేసుకొని వెళ్లారు. అయితే పోస్టాఫీస్, కొన్ని బ్యాంకులలో నగదు సరిపడా లేక వెనుదిరిగారు. మరో రెండు రోజులు ఇదే రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో ఆయా బ్యాంకలు, పోస్టాఫీసులలో ఎక్కువ మొత్తం నగదు అందుబాటు లో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు.


పోస్టాఫీస్ వద్ద క్యూలో ఉన్న మహిళలు


బ్యాంకు తెరవకముందే వేచి ఉన్న మహిళలు

అవీ..ఇవీ..

ఏవోగా రాము బాధ్యతల స్వీకరణ

పొన్నలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన వ్యవసాయాధికారిగా వడ్డె రాము నియమితులయ్యారు. పొన్నలూరులో సోమవారం రాము బాధ్యతలు చేపట్టారు. కందుకూరు నుంచి రాము బదిలీపై రాగా, ఇప్పటిదాకా వ్యవసాయాధికారిగా పనిచేసిన పూర్ణచంద్రరావు సింగరాయకొండకు బదిలీ అయ్యారు.

పశువైద్యాధికారి శివరామకృష్ణ బాధ్యతలు

పొన్నలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పశువైద్యశాల అధికారిగా జె. శివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చౌటపాలెం పశువైద్యశాలలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. పశుసంవర్ధకశాఖ అందించే గోకులంషెడ్లు, పశ్రుగాసపెంపకం, బీమా, సబ్సిడీపై దాణా వంటి పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మార్టూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని రాజుపాలెం కూడలిలో సోమవారం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చినగంజాం మండలం సంతరావూరు గ్రామానికి చెందిన చుండూరి కోటేశ్వరరావు,సునీత దంపతులు వ్యక్తిగత పనులు నిమిత్తం ద్విచక్రవాహనంపై పెట్లూరివారిపాలెం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామం వస్తున్నారు. వారి ద్విచక్రవాహనాన్ని విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో వారు రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమయిన కారుతోపాటు డ్రైవరు మురుగన్ పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి


జీడిపప్పు కార్మికులు, చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న నిర్వాహకులు

వేటపాలెం(చీరాల), జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవనవిధానంలో ప్రతి ఒక్కరూ పిల్లల విద్యాబుద్ధులపై ప్రత్యేక దృష్టిసారిస్తే ఉన్నతంగా రాణిస్తారని వేటపాలెం పట్టభద్రుల సంఘం ప్రతినిధులు అన్నారు. సోమవారం వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని జీడిపప్పు కార్మికుల కుటుంబాల్లోని చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో వెలుగు నిండాలంటే చక్కనైన చదువే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బట్ట మోహన్‌రావు, నాగాంజనేయులు, శరత్‌బాబు, శేఖర్‌బాబు, బుల్లియ్య, తిలక్, అయ్యప్ప, శ్రీను, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో రక్తదానం


జ్యోతిస్వరూప్‌ను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ శ్రీకాంత్, వైద్యులు

చీరాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సోమవారం సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం విద్యార్థులు రక్తదానం చేశారు. ఏటా చీరాల వైద్యశాలకు ఇక్కడి విద్యార్థులు రక్తదానం చేస్తున్నట్లు వైద్యశాల సూపరిండెంట్ డా॥శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ యేడాది కూడా కళాశాల నుంచి జాతీయ సేవా విభాగం(ఎన్ఎస్ఎస్) కో - ఆర్డినేటర్ డా.జ్యోతి స్వరూప్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. దీంతో ఆయన్ను వైద్యశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సహకారంతో విద్యార్థులు సైతం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు చెప్పారు.


బడిబయట ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్


విద్యార్థులను కలిసి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బడిమానిన పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హనుమంతురావు పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం సాయంత్రం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాలకు వచ్చి బడికి రాని విద్యార్థులను ఉపాధ్యాయులు కలిసి వారికి చదువు కోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ద్వారా నగదు అందజేస్తుందన్నారు. అలానే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్య అందించే బాధ్యత తమది అని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అచ్యుత్‌మోహన్, డేవిడ్‌పాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టమోటాల ట్రక్కు బోల్తా

చినగంజాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : టమోటాల లోడుతో వెళుతున్న వాహనం చినగంజాం సమీపంలోని జాతీయరహదారి టీ-జంక్షన్ సమీపంలోని రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. హైవే మొబైల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిత్తూరు జిల్లా పలమనేరు నుండి బొలెరో పికప్ వాహనం టమోటాల లోడుతో బాపట్లకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో వాహనం చినగంజాం సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వాహనం డ్రైవర్ ఆర్ శ్రీనివాసరావుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. టమోటాలు అన్ని జాతీయ రహదారిపై పడ్డాయి. వాహనాన్ని హైవే పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు ఇబ్బంది లేకుండా చేశారు.


రహదారిపై బోల్తాపడ్డ ట్రక్కు

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు,జూన్16(ఆంధ్రజ్యోతి): లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మార్టూరు కూడలి సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకొంది. యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామానికి చెందిన కనపర్తి తేజ అనే యువకుడు వ్యక్తిగత పనులు నిమిత్తం మార్టూరుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో లారీని ఢీకొన్నాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

అద్దంకి, జూన్16(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని సోమవారం అద్దంకి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి అఖిల ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో పేకాట శిబిరంపై ఎస్ఐ వై.నాగరాజు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఘటన స్థలంలో ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి ఉన్న రూ.2800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత

బల్లికురవ. జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 350 మంది విద్యార్థులకు సోమవారం కనిగిరి ప్రాంతానికి చెందిన అలహరి మహేంద్రనాయుడు అభ్యసన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయుత అందించిన దాతను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే.శేషగిరిరావు, అలహరి లావణ్య, ప్రదానోపాధ్యాయుడు మారుతి, కుందుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అభ్యసన సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా యోగాంధ్ర

- డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందని యోగాంధ్ర ట్రైనర్, హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో యోగాంధ్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా ట్రైనర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో మానసిక ఒత్తిడినిన అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చన్నారు.


శిక్షణ ఇస్తున్న చంద్రశేఖర్

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి టేబుల్స్ అందజేత


టెబుల్స్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం అద్దంకి లోని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయానికి టెబుల్స్‌ను అందజేశారు. రోటరీక్లబ్ మిత్రుల ఆర్థిక సహకారంతో సంఘ కార్యాలయానికి రెండు కంప్యూటర్ బల్లలు, వాల్ క్లాక్‌ను బహుకరించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అడుసుమల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం నుంచి పీ4 కార్యక్రమం ప్రారంభం

చినగంజాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పీ4 కార్యక్రమం మొట్టమొదటిసారిగా చినగంజాం మండలం నుంచి చేయడం సంతోషకరమని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పీ4 లబ్ధిదారులకు ఆయన చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్లను అందజేశారు. మండలంలో ఎంపిక చేసిన 13 మంది లబ్దిదారులకు చేయూతను అందించేందుకు రూ.10.95 లక్షలను అందించినట్లు ఏపీఎం గడ్డె పెదసుబ్బారావు తెలిపారు. పెదగంజాం గ్రామానికి చెందిర కే.వెంకటరెడ్డికి ట్రై సైకిల్, ముగ్గురికి చెవిటి మిషన్లు, 9 మందికి వివిధ వ్యాపారాల నిమిత్తం రూ.10 లక్షలను అందజేసినట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు, పీ-4 లబ్దిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వెంకటరెడ్డికి ట్రై సైకిల్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళీ